# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 74, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) ఆదివారం -01 - జూన్ - 2025

వందకుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి..

## ఎదురు దాడులకు దిగిన కీవ్

జపోరిజ్జియా ప్రాంతంలోని ఫ్రంట్-లైన్ గ్రామం డోలింకాపై జరిగిన దాడిలో 9ఏళ్ల చిన్నారి మృతి



భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు జపోరిజ్జియా గవర్నర్ ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు

రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడుల్లో 14మంది గాయాలు

సాగర తీరంలో పరుగులు పెట్టనున్న మెట్రో..

## పనులు వేగవంతం చేసిన ప్రభుత్వం

విశాఖ మెట్రో పనుల వేగవంతానికి కూటమి సర్కార్ చర్యలు

జనరల్ కన్సల్టెన్సీ కోసం ఏఎంఆర్‌సీ బిడ్ల ఆహ్వానం

2లో



అక్టోబర్‌లో శంకుస్థాపనకు ప్రభుత్వ సన్నాహాలు

తొలి దశలో 46.23 కి.మీ., 42 స్టేషన్ల నిర్మాణం

భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు మెరుగైన కనెక్టివిటీపై దృష్టి

## దేశంలో 3 వేలకు చేరువైన కొవిడ్ కేసులు

కేరళలో అత్యధికం.. వైరస్ తో ఏడుగురి మృతి

నాలుగు రోజుల్లోనే 1010 నుంచి 2710కి చేరిన కేసులు



2లో

మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్‌లలో కూడా పెరుగుతున్న బాధితులు

ఆంధ్రప్రదేశ్‌లో 16, తెలంగాణలో 3 యాక్టివ్ కేసులు




2

## బాబుగారూ.. ‘టెన్త్’లో మీరు, మీ కొడుకు ఫెయిల్

- పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
- మీ అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలే ఎదురవుతున్నాయి
- ప్రతి స్టూడెంట్‌కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తంచేసే పరిస్థితిని తీసుకు వచ్చారు

ఆ విషయంలో ధనిక రాష్ట్రాల కంటే

# ఏపీనే గ్రేట్

- దాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు
- కాట్రేనికోన మండలం చెయ్యేరులో పింఛన్ల పంపిణీ
- ధనిక రాష్ట్రాల కంటే ఏపీలోనే ఎక్కువ పింఛన్లు ఇస్తున్నామన్న సీఎం
- ప్రతినెలా 64 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నామని వెల్లడి



అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం చెయ్యేరులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం చెయ్యేరులో ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. పింఛన్లు పెంచుతామని చెప్పి... ఇచ్చినమాట నిలబెట్టుకున్నామని చంద్రబాబు అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఫింఛన్లను రూ. 3వేల నుంచి రూ. 4 వేలకు పెంచామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పింఛన్ల కోసం రూ. 34వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. పేదలకు ఎప్పటికప్పుడు పింఛన్లు పెంచిన ఘనత టీడీపీకే దక్కుతుందని ముఖ్యమంత్రి అన్నారు. మూడు నెలలకు మిగతా..2లో

## జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు

- కొత్త విధానంతో.. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట
- జూన్ 1 నుంచి పేదలకు రేషన్ దుకాణాల్లోనే నిత్యావసరాలు
- ప్రతినెలా 1 నుంచి 15 వరకు సరుకుల పంపిణీ
- ఉదయం 8-12, సాయంత్రం 4-8 వరకు షాపులు తెరిచే ఉంటాయి



అమరావతి: రాష్ట్రంలోని పేద కుటుంబాలకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇకపై ప్రతినెలా ఒకటో తేదీ నుంచి పదిహేనో మిగతా..2లో

## వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: భట్టి విక్రమార్క



2లో

- ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కల్పించేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం
- దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యం

వందకుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి..

ఎదురు దాడులకు దిగిన కీవ్

జపోరిజ్జియా ప్రాంతంలోని ఫ్రంట్-లైన్ గ్రామం డోలింకాపై జరిగిన దాడిలో 9ఏళ్ల చిన్నారి మృతి భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు జపోరిజ్జియా గవర్నర్ ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు

రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడుల్లో 14మంది గాయాలు



2లో

## భారత నారీశక్తిని సవాల్ చేసిన ఉగ్రవాదులు మట్టిలో కలిశారు

- పహల్గామ్ దాడికి ప్రతీకారంగా ‘ఆపరేషన్ సిందూర్’
- ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులతో పాటు వారూ భారీ మూల్యం చెల్లించుకున్నారు
- ఉగ్రవాదులను పోషించేవారికీ భారీ మూల్యం తప్పదని ప్రధాని హెచ్చరిక
- రాణి అహల్యాబాయి 300వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగం



ఢిల్లీ: పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’లో భారత నారీశక్తి కీలక పాత్ర పోషించిందని, ఈ చర్య ద్వారా ఉగ్రవాదులు తమ వినాశనాన్ని తామే కొని తెచ్చుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఆపరేషన్‌లో పలువురు మహిళా అధికారులు పాల్గొని ఉగ్రవాదుల ఆచూకీని గల్లంతు చేశారని ఆయన ప్రశంసించారు. రాణి అహల్యాబాయి హొల్కర్ 300వ జయంతి సందర్భంగా శనివారం భోపాల్‌లో నిర్వహించిన ‘మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్’లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘ఆపరేషన్ సిందూర్’ ద్వారా ఉగ్రవాదులే మిగతా..2లో



2

## కేసీఆర్‌కు ఒక కన్ను భారాస .. రెండో కన్ను జాగృతి సంస్థ

హైదరాబాద్: తెలంగాణ ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ పనిచేసిందని భారాస ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ‘తెలంగాణ జాగృతి’ నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. “కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో మిగతా..2లో

## గోశాలల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

- ★ అత్యాధునిక గోశాలల ఏర్పాటుకు సీఎం రేవంత్ ఆదేశం
- ★ రంగారెడ్డి జిల్లా ఎంకేపల్లి గోశాల డిజైన్లకు త్వరలో ఆమోదం
- ★ గోశాలల ఏర్పాటుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు



గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణ కోసం పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలు రూపొందించాలని చెప్పారు. గోసంరక్షణ, వాటి నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు జరగాలని, మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని చెప్పారు. బంధించినట్టుగా ఇరుకు స్థలాల్లో కాకుండా మేతకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండాలన్నారు. గోశాలల నిర్వహణ, సంరక్షణ విషయంలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

## కల్వకుంట్ల సినిమాకు ప్రొడక్షన్ చేస్తున్నది కాంగ్రెస్

- తెలంగాణలో కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్ జరుగుతోంది
- “భారాసలో చార్‌పత్తా ఆట నడుస్తోంది
- భాజపా-భారాస ఎప్పుడూ కలవవు
- కవిత అరెస్టు జరగకుండా ఉండేందుకు మా పార్టీతో కలిసేందుకు ప్రయత్నించారు
- కవిత వ్యవహారం.. అదంతా ఫ్యామిలీ డ్రామా



హైదరాబాద్: భారాస ఎమ్మెల్సీ కవిత వ్యవహారం అంతా ఫ్యామిలీ డ్రామా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్ జరుగుతోందని ఎద్దేవా చేశారు. “భారాసలో మిగతా..2లో

శుభోదయం
ఆదివారం - 01 - జూన్ - 2025

# అద్భుతమైన 'ఆపరేషన్' నిర్వహించారు

ఢిల్లీ: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో రాఫెల్ యుద్ధ విమానాలు ఏమైనా కూలిపోయాయా? అని తాము అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ మంత్రి సరైన సమాధానం చెప్పలేదని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ రాఫెల్ యుద్ధ విమానం కూలిపోయిందని సిడిఎస్ అనిల్ చౌహన్ మాత్రం స్పష్టం చేశారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు ఉత్తమ్‌కుమార్ రెడ్డి. ఇకనైనా భారత్ ప్రభుత్వం దీన్ని నిరాకరించడం మానుకోవాలననారు. 'ఇదే విషయాన్ని రాహుల్ గాంధీ మొదటి నుంచి అడుగుతున్నారని ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక కాల్పుల విరమణ అంశానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎలా ట్వీట్ చేస్తారని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత ఎయిర్‌ఫోర్స్ విజయం పట్ల మేము గర్విస్తున్నామని, ఇదొక అద్భుతమైన ఆపరేషన్ అని ఉత్తమ్ కొనియాడారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం భారత్ ఎయిర్‌ఫోర్స్ సాధించిన విజయమన్నారు. ఫైటర్ విమానాలు, ఆయుధాల సప్లయ్ ఆలస్యం అవుతున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ చెప్పడం ఆందోళన కల్గిస్తోందన్నారు. చైనా, పాకిస్తాన్‌లతో ముప్పు నేపథ్యంలో భారత భద్రతను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తేలికపాటి యుద్ధ విమానాల సప్లై అంశం కూడా ఆలస్యం అవుతుందని, అత్యవసరంగా ఈ సమస్యను పరిష్కరించాలని కేంద్రానికి సూచించారు. ఆపరేషన్ , ఆర్ అండ్ డి(రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) విభాగాలలోకి బెస్ట్ బ్రెయిన్స్ రావడం లేదని ఉత్తమ్ పేర్కొన్నారు.

# బాబుగారూ.. 'టెన్త్'లో మీరు, మీ కొడుకు ఫెయిల్

గుంటూరు: పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, విద్యా వ్యవస్థే ఇలా ఉంటే మిగతా వాటిని ఎంత ఘోరంగా నడుపుతున్నారోనని సీఎం చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చురకలంటించారు. ఈ మేరకు నాలుగు పాయింట్లతో కూడిన సందేశాన్ని ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "చంద్రబాబు గారూ.. మీరు, మీ కొడుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ టెన్త్ పరీక్షల నిర్వహణలో పూర్తిగా ఫెయిల్ అయ్యారు. మీ పాలనలో విద్యారంగం భ్రష్టుపట్టిపోయింది. మీ అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలే ఎదురవుతున్నాయి. పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉన్న మీరు, మిగతా వ్యవస్థలను ఇంకా ఎంత ఘోరంగా నడుపుతున్నారో అర్థం అవుతోంది. సుమారు 6.14 లక్షల మంది రాత్రీపగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించాల్సిన మీరు, ఘోరంగా విఫలమై, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను క్షోభకు గురిచేశారు. ఇప్పుడు ప్రతి స్టూడెంట్‌కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తంచేసే పరిస్థితిని తీసుకు వచ్చారు. మీరు చేసిన తప్పులు కారణంగా ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా అడ్మిషన్లలో విద్యార్థులు అన్యాయమైపోయిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. చంద్రబాబుగారూ దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అసలు పరీక్షల నిర్వహణ సమయంలోనే మీ బేలతనం బయటపడింది. ప్రశ్నపత్రాలు లీకేజీ అయ్యాయి. అయినాసరే తప్పులను సరిదిద్దుకోకపోవడం మీ అసమర్థతకు నిదర్శనం కాదా? మన రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి ప్రపంచస్థాయిలో పోటీని ఎదుర్కొనేలా తీసుకొచ్చిన అనేక సంస్కరణలను వచ్చీరాగానే దెబ్బతీశారు. స్కూళ్లలో నాడు-నేడు, గోరుముద్ద, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకూ ప్రయాణం, 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు, 3వ తరగతి నుంచే సబ్జెక్టుల వారీగా బోధన ఇలా ప్రతి మంచి కార్యక్రమాన్ని కక్షగట్టి నీరుగార్చారు. తల్లులను ప్రోత్సహిస్తూ ఇచ్చే అమ్మ ఒడిని రద్దుచేశారు. ఇప్పుడు పరీక్షలు నిర్వహణ, ఫలితాల వెల్లడిలోనూ విఫలమవుతున్నారు. చంద్రబాబుగారూ మీరు చేసిన తప్పుల వల్ల విద్యార్థులు బలైపోవడానికి వీల్లేదు. ఎలాంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయండి. తుది ఫలితాలు వచ్చేంతవరకూ టెన్త్ మార్క్స్ ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను కొన్నిరోజులపాటు నిలిపివేయండి. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మొదలు అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు.

# దేశంలో 3 వేలకు చేరువైన కొవిడ్ కేసులు

ఢిల్లీ: దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 3,000 కు చేరువ కావడం ఆందోళన కలిగిస్తోంది. కేరళలో కేసులు వేగంగా పెరుగుతున్నాయి. మహారాష్ట్ర, ఢిల్లీలోనూ బాధితులు పెరుగుతున్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం, కేవలం నాలుగు రోజుల్లోనే కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మే 26న దేశవ్యాప్తంగా 1,010 యాక్టివ్ కేసులు నమోదు కాగా, మే 30 నాటికి ఈ సంఖ్య 2,710కి చేరింది. రాష్ట్రాల వారీగా చూస్తే, కేరళలో అత్యధికంగా 1,147 యాక్టివ్ కేసులున్నాయి. మహారాష్ట్రలో 424, ఢిల్లీలో 294, గుజరాత్‌లో 223 కేసులు నమోదయ్యాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఒక్కొక్కటి 148 చొప్పున కేసులు ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో 116 మంది కొవిడ్ తో బాధపడుతున్నారు. రాజస్థాన్‌లో 51, ఉత్తరప్రదేశ్‌లో 42, పుదుచ్చేరిలో 25, హర్యానాలో 20 చొప్పున యాక్టివ్ కేసులున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 16, తెలంగాణలో 3 యాక్టివ్ కేసులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 10, గోవాలో 7, ఒడిశా, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లలో 4 కేసుల చొప్పున నమోదయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్‌లలో 3 చొప్పున, మిజోరాం, అసోంలలో రెండేసి గుర్తించారు. అండమాన్ నికోబార్, బీహార్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్‌లలో ప్రస్తుతం ఒక్క యాక్టివ్ కేసు కూడా లేకపోవడం గమనార్హం.

ఈ నెలలో ఏడుగురు మృతి.. ఈ నెలలో కరోనా మహమ్మారి కారణంగా ఏడుగురు మరణించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మహారాష్ట్రలో ఇద్దరు మరణించగా, ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. మరణించిన వారిలో పంజాబ్‌కు చెందిన వ్యక్తి మినహా మిగిలిన వారందరూ వయోవృద్ధులని, వారు ఇతర తీవ్ర అనారోగ్య సమస్యలతో కూడా బాధపడుతున్నారని అధికారులు వివరించారు.

### వందకుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి..

# ఎదురు దాడులకు దిగిన కీవ్

రష్యా, ఉక్రెయిన్: ఇటీవల తుర్కియే వేదికగా రష్యా, ఉక్రెయిన్ మధ్య ప్రత్యక్ష శాంతి చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. వాటి వల్ల ఫలితం లేకపోవడంతో తాజాగా మరోసారి ప్రత్యక్ష చర్చల కోసం రష్యా ప్రతిపాదనలు చేసింది. ఒకవైపు శాంతి ఒప్పందానికి సన్నద్ధం అవుతున్నప్పటికీ మరోవైపు ఇరుదేశాలు దాడులు కొనసాగిస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు మాస్కో.. కీవ్‌పై దాదాపు వందకు పైగా డ్రోన్లు, ఐదు క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొంది. వాటిలో 42డ్రోన్లను తమ సైన్యం ధ్వంసం చేసిందని తెలిపింది. జపోరిజ్జియా ప్రాంతంలోని ఫ్రంట్-లైన్ గ్రామం డోలింకాపై జరిగిన దాడిలో 9ఏళ్ల చిన్నారి మృతి చెందగా ..భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు జపోరిజ్జియా గవర్నర్ ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు. పలువురు గాయపడ్డారన్నారు. దీంతో కీవ్ సైతం మాస్కోపై ప్రతీకార దాడులు చేసింది. రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడుల్లో 14మంది గాయపడ్డారని..పలు భవనాలు ధ్వంసమయ్యాయని రష్యా ఆరోగ్యశాఖ వెల్లడించింది. శుక్రవారం ఉక్రెయిన్ ప్రభుత్వ సలహాదారు ఆండ్రీ యెర్మాక్ మాట్లాడుతూ.. సోమవారం ఇస్తాంబుల్‌లో రష్యాతో ప్రత్యక్ష శాంతి చర్చలను తిరిగి ప్రారంభించడానికి కీవ్ సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చర్చల ప్రారంభానికి ముందు యుద్ధం ముగింపుపై తన వైఖరిని తెలుపుతూ.. వాగ్దానం చేసిన మెమోరాండాన్ని రష్యా తమకు అందించాలని షరతు పెట్టారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మే 19న ట్రంప్, పుతిన్ ఫోన్ కాల్‌లో దాదాపు రెండు గంటలకుపైనే మాట్లాడుకున్నారు. అనంతరం పుతిన్ స్పందిస్తూ భవిష్యత్తు శాంతి ఒప్పందానికి సంబంధించి ఉక్రెయిన్‌తో కలిసి పనిచేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. మరో వైపు ఉక్రెయిన్‌తో పోరాడడానికి ఇప్పటికే వేలమంది సైన్యాన్ని, ఆయుధాలను మాస్కోకు పంపిన ఉత్తర కొరియా తాజాగా మరో 14 వేల మంది సైన్యం, 9లక్షల రౌండ్ల మందుగుండు సామగ్రి, 100 బాలిస్టిక్ క్షిపణులు, రాకెట్ లాంచర్లు రష్యాకు పంపినట్లు సమాచారం. దీంతో యుద్ధం ముగింపుపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి..

# భారత్-పాకిస్థాన్ ఘర్షణకు దిగితే ఆ ఒప్పందంపై ఆసక్తి తగ్గుతుంది: డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

అమెరికా: భారత్‌తో కీలకమైన వాణిజ్య ఒప్పందం కుదిరే సమయం ఆసన్నమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో భారత్ నుంచి దిగుమతులపై అమెరికా సుమారు 26 శాతం మేర సుంకాలను విధించిన విషయం తెలిసిందే. ఈ సుంకాల వివాదాన్ని పరిష్కరించుకుని, ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరు దేశాలు కొంతకాలంగా చర్చలు జరుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ విషయాలను వెల్లడించారు. భారత్‌తో సుంకాలపై చర్చలు సజావుగా సాగుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంతో ఒక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు తాము చాలా సమీపంలో ఉన్నామని ఆయన అన్నారు. అదే సందర్భంలో ఒక కీలకమైన వ్యాఖ్య కూడా చేశారు. ఒకవేళ భారత్, పాకిస్థాన్‌లు ఘర్షణల బాట పడితే, వారితో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలన్న ఆసక్తి తనకు ఉండబోదని ట్రంప్ స్పష్టం చేశారు. వాణిజ్యపరమైన అంశాలపై చర్చించేందుకు పాకిస్థాన్ నుంచి కూడా ప్రతినిధుల బృందం వచ్చే వారంలో వాషింగ్టన్‌కు రానుందని ఆయన తెలియజేశారు. ఇదిలా ఉండగా, భారత్, అమెరికాల మధ్య మొదటి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ఎప్పటినుంచో చర్చలు కొనసాగుతున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్‌తో ఈ విషయమై సమావేశమయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్ మాసాల కల్లా ఈ మొదటి దశ ఒప్పందాన్ని ఒక కొలిక్కి తేవాలని ఇరు పక్షాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ చర్చల ద్వారా ప్రధానంగా రెండు దేశాల మార్కెట్లను పరస్పరం వినియోగించుకోవడం, స్థానిక నిబంధనల అమలు తీరు, సుంకాల మినహాయింపులకు సంబంధించిన పరిమితులు వంటి అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

పాల్వంచ: ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కల్పించేందుకు చిత్తశుద్ధితో ఉన్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యమన్నారు. "వెనుకబడిన వర్గాలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూగరిష్ఠ పరిమితి చట్టం చేసింది. భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూములు పంపిణీ చేసింది. 6.70 లక్షల ఎకరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. పేదలకు పంచిన భూములను వారు దున్నుకోకుండా భారాస ప్రభుత్వం అడ్డుకుంది. గిరిజనుల భూమికి సాగునీటి కోసం 'ఇందిరా సౌర గిరిజల వికాసం' పథకాన్ని ప్రారంభించాం. దీనికోసం రూ.12,500 కోట్లు కేటాయించాం. 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే" అని భట్టి విక్రమార్క వివరించారు.

# గోశాలల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక సదుపాయాలతో కూడిన గోశాలలను ఏర్పాటు చేసేందుకు పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోవుల సంరక్షణ, నిర్వహణ మెరుగుపరిచే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, గోశాలల ఏర్పాటుకు సంబంధించి ఒక ప్రత్యేక కమిటీని నియమించాలని ఆయన సూచించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన గోశాలకు సంబంధించిన డిజైన్లను రాబోయే నాలుగైదు రోజుల్లోగా ఖరారు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదిత కమిటీ, గోశాలల ఏర్పాటుకు సంబంధించిన అన్ని అంశాలపై లోతైన అధ్యయనం చేసి, నిర్దేశిత గడువులోగా సమగ్రమైన, పూర్తిస్థాయి ప్రణాళికను ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తొలి విడతలో భాగంగా, పశుసంవర్ధక, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు, అలాగే దేవాలయాలకు చెందిన అందుబాటులో ఉన్న భూముల్లో ఈ ఆధునిక గోశాలలను ఏర్పాటు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. నిర్మించబోయే గోశాలలు కేవలం గోవులను ఇరుకు ప్రదేశాల్లో బంధించినట్లుగా ఉండరాదని, అవి స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా, అన్ని రకాల అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకోసం, ప్రతి గోశాలను కనీసం 50 ఎకరాల విశాలమైన స్థలంలో ఏర్పాటు చేసేలా అనువైన భూములను గుర్తించాలని ఆయన ఆదేశించారు. అంతేకాకుండా, ఈ గోశాలల సమర్థవంతమైన నిర్వహణ కోసం ధార్మిక సంస్థలు, సేవా సంఘాలను భాగస్వాములను చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# నైజీరియాలో ఉగ్రకుట్ర బోకో హరాంకు పాక్ శిక్షణ

ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడంలో పాకిస్థాన్ పాత్ర మరోసారి బట్టబయలైంది. నైజీరియాలో బోకో హరాం ఉగ్రవాద సంస్థ సభ్యులకు శిక్షణ ఇవ్వడంతో పాటు, ఆయుధాలు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలపై నలుగురు పాకిస్థానీయులను నైజీరియా భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామం తీవ్ర కలకలం రేపుతోంది. నైజీరియా, సుమారు 46 శాతం ముస్లిం జనాభా కలిగిన దేశం. దశాబ్దానికి పైగా ఇక్కడ బోకో హరాం ఉగ్రవాదులతో పోరాటం కొనసాగుతోంది. తాజా అరెస్టులతో, దక్షిణాసియా నుంచి గల్ఫ్ దేశాలకు, బహుశా అంతకు మించి కూడా సరిహద్దు ఉగ్రవాదం విస్తరించిందన్న ఆందోళనలు మరింత బలపడుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం, నైజీరియా అధికారులు వెల్లడించిన వివరాల మేరకు, అరెస్టయిన పాకిస్థాన్ పౌరులు బోకో హరాం ఉగ్రవాదులకు కేవలం ఆయుధాలు సరఫరా చేయడమే కాకుండా, కీలకమైన యుద్ధ నైపుణ్యాలలో శిక్షణ కూడా ఇస్తున్నారని తెలుస్తోంది. ఆకస్మిక దాడులు ఎలా చేయాలి, నిఘా డ్రోన్లను ఎలా ఉపయోగించాలి వంటి అంశాలపై వీరు తర్ఫీదు ఇస్తున్నట్లు సమాచారం. పాకిస్థానీయులతో సహా విదేశీ కిరాయి సైనికుల మద్దతుతో బోకో హరాం, ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ వంటి సంస్థల సామర్థ్యం గణనీయంగా పెరిగిందని నివేదికలు సూచిస్తున్నాయి. నైజీరియా సైన్యానికి చెందిన 'ఆపరేషన్ హదిన్ కాయ్ థియేటర్' కమాండర్ మేజర్ జనరల్ అబ్దుల్ సలామీ అబూబకర్ మాట్లాడుతూ, ఈ విదేశీయులు తిరుగుబాటు గ్రూపులకు వ్యూహాత్మక యుద్ధ పరిజ్ఞానాన్ని అందిస్తున్నారని తెలిపారు. దీనివల్ల బలహీనపడిన బోకో హరాం మరింత ప్రమాదకరమైన ఉగ్రవాద సంస్థగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల ప్రారంభంలో నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలోని క్వాటండయా, మల్లాం కరమ్తీ గ్రామాల్లో బోకో హరాంకు చెందిన ఓ వర్గం అత్యంత క్రూరమైన దాడులకు పాల్పడింది. ఈ దాడిలో కనీసం 57 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది బాధితుల గొంతులు కోసి లేదా కాల్చి చంపినట్లు సమాచారం. ఉగ్రవాదులు 70 మందికి పైగా ప్రజలను అపహరించినట్లు కూడా తెలుస్తోంది. 2009 నుంచి బోకో హరాం సృష్టిస్తున్న హింసాకాండ కారణంగా 35,000 మందికి పైగా మరణించగా, దాదాపు 26 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఈ సంస్థ పిల్లలను సైనికులుగా నియమించుకోవడంతో పాటు, సామూహిక హత్యలు, అపహరణలకు పాల్పడుతోంది. ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడంలో పాకిస్థాన్ పాత్రపై విశ్లేషకులు చాలాకాలంగా హెచ్చరిస్తూనే ఉన్నారు. రష్యా, ఇరాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ లతో పాటు, అమెరికాలో జరిగిన 9/11 దాడుల్లో కూడా పాకిస్థాన్ ప్రమేయానికి సంబంధించి నిర్ధారణ కాని సంబంధాలు ఉన్నాయని గతంలో వార్తలు వచ్చాయి. ఇటీవల భారత్ లో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' అనే తీవ్రవాద నిరోధక ఆపరేషన్, పాకిస్థాన్ సైన్యం, నిఘా సంస్థలపై మరింత నిశిత పరిశీలనకు దారితీసింది. నైజీరియాలో తాజా అరెస్టులు ఈ ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. దక్షిణాసియాకు వేల కిలోమీటర్ల దూరంలో హింసాత్మక గ్రూపులకు పాకిస్థానీ పౌరులు సహాయం చేస్తున్నారన్న ఆరోపణలు, శాంతి, స్థిరత్వం, మానవ భద్రతపై అంతర్జాతీయంగా తీవ్ర ప్రభావం చూపుతాయన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ప్రాంతీయ భద్రతా సమస్యగా పరిగణించిన ఈ వ్యవహారం, ఇప్పుడు విస్తృతమైన ప్రపంచ అత్యవసర పరిస్థితిగా మారుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆ విషయంలో ధనిక రాష్ట్రాల కంటే ఏపీనే గ్రేట్

మొదటి పేజి తరువాయి



మూడు నెలలకు ఒకసారి ఇచ్చే పింఛన్లలో అదనంగా 9,176 మందికి ఇచ్చామన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో పింఛన్లు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రతినెలా 1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 64 లక్షల మంది పింఛన్ దారులకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ఇక, గత వైసీపీ ప్రభుత్వం వితంతు పింఛన్లు ఇవ్వలేదని చంద్రబాబు విమర్శించారు. కానీ, కూటమి ప్రభుత్వం 71,380 మందికి వితంతు ఫింఛన్లు ఇచ్చినట్లు వెల్లడించారు. ధనిక రాష్ట్రాల కంటే ఏపీలోనే ఎక్కువ పింఛన్లు ఇస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ, మహారాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే అధిక పింఛన్లు పంపిణీ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. డయాబెటీస్ కారణంగా కాలు కోల్పోయిన పోలిశెట్టి దుర్గాప్రసాద్ అనే వ్యక్తికి కూడా ఈ నెల నుంచే పింఛన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇక, 16,347 టీచర్ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశానని, దాని అమలు చేసే దిశగా త్వరితగతిన ముందుకు వెళుతున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

### భారత నారీశక్తిని సవాల్ చేసిన

# ఉగ్రవాదులు మట్టిలో కలిశారు

మొదటి పేజి తరువాయి



'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాదులే కాకుండా, వారిని పోషించేవారు కూడా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత్ ప్రపంచానికి స్పష్టం చేసిందని ప్రధాని పేర్కొన్నారు. ఆ సమయంలో భారతీయ మహిళల శక్తిసామర్థ్యాలను ప్రపంచమంతా చూసిందని ఆయన గుర్తుచేశారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం, భారత సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్థాన్ దాడులు జరిపినప్పుడు, అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలోని బీఎస్ఎఫ్ మహిళా బృందం అఖ్నూర్‌లోని ఫార్వర్డ్ పోస్టుల వద్ద మూడు రోజుల పాటు వీరోచితంగా పోరాడిందని ప్రధాని కొనియాడారు. "మన సంప్రదాయంలో 'సిందూర్' 'నారీశక్తి'కి చిహ్నం. పహల్గామ్‌లో, ఉగ్రవాదులు కేవలం మన పౌరుల రక్తం మాత్రమే చూడలేదు, మన సంస్కృతిపై దాడి చేశారు. మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు భారత నారీశక్తికి విసిరిన సవాలే వారి పాలిట, వారిని పోషిస్తున్న వారి పాలిట శాపంగా మారింది. పాకిస్థాన్ సైన్యం కూడా ఊహించని ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలపై మన సాయుధ దళాలు దాడులు చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం చేపట్టిన ఈ ఆపరేషన్ భారత చరిత్రలోనే అతిపెద్ద విజయం" అని వ్యాఖ్యానించారు.

### సాగర తీరంలో పరుగులు పెట్టనున్న మెట్రో..

# పనులు వేగవంతం చేసిన ప్రభుత్వం

విశాఖపట్నం: సాగరనగరం విశాఖపట్నంలో మెట్రో రైలు కూతకు రంగం సిద్ధమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. నగరంలో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు ఆధునిక రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏఎంఆర్‌సీ) ఇటీవల జనరల్ కన్సల్టెన్సీ నియామకం కోసం బిడ్లను ఆహ్వానించింది. ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయాలని కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తొలిదశలో భాగంగా సుమారు రూ.11,498 కోట్ల అంచనా వ్యయంతో 46.23 కిలోమీటర్ల మేర మూడు ప్రధాన కారిడార్లలో 42 స్టేషన్లను నిర్మించాలని ప్రతిపాదించారు.

**కారిడార్ 1: స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు (34.40 కి.మీ., 29 స్టేషన్లు)**

**కారిడార్ 2: గురుద్వారా నుంచి పాత పోస్ట్ ఆఫీస్ వరకు (5.07 కి.మీ., 6 స్టేషన్లు)**

**కారిడార్ 3: తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు (6.75 కి.మీ., 7 స్టేషన్లు)**

ఈ ప్రాజెక్టు కోసం సుమారు 98 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రాజెక్టుకు అవసరమైన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. పలు సంస్థలు రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ప్రాజెక్టుకు 100% నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. రాబోయే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం కల్పించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. 2026 నాటికి భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రానున్న నేపథ్యంలో, దానికి అనుగుణంగా కనెక్టివిటీని మెరుగుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకోసం వీఎంఆర్‌డీఏ 15 కీలక రహదారులను గుర్తించి, వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. విశాఖ మెట్రో ప్రాజెక్టులో భాగంగా నిర్మించతలపెట్టిన డబుల్ డెక్కర్ నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సుమారు 20.07 కిలోమీటర్ల మేర (మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం, గాజువాక నుంచి స్టీల్ ప్లాంట్ మధ్య) ఈ డబుల్ డెక్కర్ వ్యవస్థను ప్రతిపాదించారు. కింద రోడ్డు, దానిపై ఫ్లైఓవర్, ఆ పైన మెట్రో ట్రాక్ ఉండేలా దీన్ని నిర్మిస్తారు. ఇది పూర్తయితే ఆసియాలోనే అతి పొడవైన డబుల్ డెక్కర్ మెట్రోగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. విశాఖపట్నం ఆర్థికంగా, పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మెట్రో రైలు ప్రాజెక్టు నగరానికి అత్యంత ఆవశ్యకం. ఐటీ కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న విశాఖకు ఈ ప్రాజెక్టు మరింత ఊతమిస్తుందని, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడమే కాకుండా, పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థను అందిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విశాఖ రూపురేఖలు మారిపోతాయని, నగరవాసుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశిస్తున్నారు.

### కేసీఆర్‌కు ఒక కన్ను భారాస ..

# రెండో కన్ను జాగృతి సంస్థ

మొదటి పేజి తరువాయి



"కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో జాగృతి సంస్థ ఏర్పడింది. ఈ సంస్థను ప్రారంభించి 18ఏళ్లు అయింది. ఇప్పటి వరకు అశోక్‌నగర్‌లో జాగృతి కార్యాలయం ఉండేది.. ఇప్పుడు బంజారాహిల్స్‌కు మార్చాం. ఇకపై ఇక్కడి నుంచే సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తాం. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎందరో ఆశీస్సులు అందించారు. మేము చేసిన ఉద్యమాల వల్ల చాలా జీవోలు వచ్చాయి. గత పదేళ్ల కేసీఆర్ పాలనకు.. ఇప్పటి కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి. అమరవీరులకు నివాళులు అర్పించాలి. కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా రేవంత్‌రెడ్డి.. 'జై తెలంగాణ' అనాలి. జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారు. రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం. తెలంగాణ యువ వికాసం అని ఉండాలి కానీ, రాజీవ్ యువ వికాసం అని ఉండకూడదు. కేసీఆర్‌కు రెండు కళ్లలా పనిచేస్తాం.. ఒక కన్ను భారాస అయితే, రెండోది జాగృతి సంస్థ. కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోం. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. యావత్ తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్టే. ఈ రాష్ట్రానికి ఆయన ఏం చేశారో ప్రజలందరికీ తెలుసు తెలంగాణ తెచ్చిన వ్యక్తికి నోటీసులు ఇస్తారా? అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. మహాధర్నాలో నోటీసుల కుట్ర మొత్తం వివరిస్తాం. గోదావరి-కావేరీ లింకేజీతో నదీ జలాలు తెలంగాణకు శాశ్వతంగా దూరమవుతాయి. బనకచర్ల ద్వారా ఏపీ ప్రభుత్వం నీళ్లు తీసుకుపోతుంటే రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు? నదుల అనుసంధానాన్ని కేసీఆర్ వ్యతిరేకించారు. తుపాకుల గూడెం వద్ద రివర్ లింకేజీ ఉండాలని ఆయన సూచించారు. ఇచ్చంపల్లి వద్ద రివర్ లింకేజీ పెడతామని కేంద్రం చెప్పింది. జూన్ 2న నదీ జలాలపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి. అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టాలని డిమాండ్ చేయాలి" అని కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్, కేసీఆర్ ఫొటోలతో తెలంగాణ జాగృతి బ్యానర్ పెట్టారు. కొత్త కార్యాలయంలో బీఆర్ అంబేద్కర్, ఆచార్య జయశంకర్, తెలంగాణ తల్లి, జ్యోతిబా ఫులే, సావిత్రిబాయి ఫులే విగ్రహాలతో పాటు అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు.

# కల్వకుంట్ల సినిమాకు ప్రొడక్షన్ చేస్తున్నది కాంగ్రెస్

మొదటి పేజి తరువాయి



తెలంగాణలో కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్ జరుగుతోందని ఎద్దేవా చేశారు. "భారాసలో చార్‌పత్తా ఆట నడుస్తోంది. కల్వకుంట్ల సినిమాకు ప్రొడక్షన్ చేస్తున్నది కాంగ్రెస్. భాజపా-భారాస ఎప్పుడూ కలవవు. కవిత అరెస్టు జరగకుండా ఉండేందుకు మా పార్టీతో కలిసేందుకు ప్రయత్నించారు. అవినీతి భారాసతో భాజపా కలవదు. కాంగ్రెస్-భారాస మాత్రమే కలిసి పనిచేశాయి. వేములవాడ రాజన్న గోశాలలో కోడెలు చనిపోవడం బాధాకరం. ఈ ఘటనపై ఈవోతో మాట్లాడతాను. కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాలను విస్తరించాలి. రాజన్న ఆలయం నిధులను మాజీ సీఎం వేరే చోట ఖర్చు చేశారు. మన సైన్యం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయి. పాక్‌పై యుద్ధం ఇంకా కొనసాగుతుందని ప్రధాని మోదీ చెప్పారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు యుద్ధం కొనసాగుతుంది " అని బండి సంజయ్ అన్నారు

# జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు

మొదటి పేజి తరువాయి



ఇకపై ప్రతినెలా ఒకటో తేదీ నుంచి పదిహేనో తేదీ వరకు చౌక ధరల దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఈ దుకాణాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయని పవన్ వివరించారు. గత ప్రభుత్వం పేదలకు రేషన్ సరుకులు అందించే చౌకధరల దుకాణాలను మూసివేసిందని పవన్ విమర్శించారు. "ఇంటింటికీ సరుకులు అందిస్తామని చెప్పి, రూ.1,600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేశారు. అయితే, ఇంటింటికీ ఇవ్వడం మానేసి, నెలలో ఒకటి రెండు రోజులు మాత్రమే ప్రధాన కూడళ్లలో వాహనాలు నిలిపి సరుకులు పంపిణీ చేయడంతో ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడ్డారు" అని ఆయన అన్నారు. రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకోవాల్సి వచ్చిందని, చిరుద్యోగాలు చేసుకునేవారు సెలవులు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన రేషన్ బియ్యం, ఇతర సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపిందని పవన్ తెలిపారు. ఈ విచారణలో భాగంగా వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖపట్నం ఓడరేవుల్లో పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టేందుకే, తిరిగి చౌకధరల దుకాణాల ద్వారానే పేదలకు నిత్యావసరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కొత్త విధానంలో భాగంగా, దివ్యాంగులు మరియు 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పేద ప్రజలకు సక్రమంగా, సకాలంలో నిత్యావసరాలు అందేలా చూడటమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన పునరుద్ఘాటించారు.

శుభోదయం

ఆదివారం -01-జూన్-2025

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న గురజాల ఎమ్మెల్యే శ్రీ యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ళ, టౌన్ రిపోర్టర్ - శీనివాసరావు (శుభోదయం నూస్): పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు శ్రీ యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని, పిడుగురాళ్ల పట్టణంలోని 26వ వార్డుకు చెందిన వివిధ రకాల పింఛన్ దారులకు పింఛన్లను పంపిణీ చేయటం జరిగిందిఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మండల తాసిల్దార్ పి.మధు బాబు గారు, పిడుగురాళ్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ గారు, మున్సిపల్ సిబ్బంది, మరియు సచివాలయ సిబ్బంది, పింఛన్ లబ్ధిదారులు, పిడుగురాళ్ల పట్టణంలోని వివిధ హోదాల్లో వున్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలు పాల్గొనటం జరిగింది.

## కొత్త పాఠ్యపుస్తకాలొచ్చాయ్



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): గత వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. వైకాపా ప్రభుత్వ హయాంలో పాఠశాలలు పునః ప్రారంభమైన రెండు, మూడు నెలలకు గాని పుస్తకాలు విద్యార్థులకు అందేవి కావు. పాఠ్యపుస్తకాల ముద్రణలో జాప్యం తదితర లోటుపాట్లను గమనించిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందించాలని సంకల్పించి చక్కదిద్దే పనిలో పడింది. గత వైకాపా హయాంలో జగనన్న విద్యా కానుక అంటూ రాజకీయ నాయకుని పేరిట విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తే అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ను గౌరవిస్తూ ఆయన పేరుతో విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేయనుంది. రానున్న 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పేరిట కిట్లు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక అమలు చేసింది. మండలంలోని స్టాక్ పాయింట్ కు జిల్లా కమిటీ పర్యవేక్షణలో కొత్త పాఠ్యపుస్తకాలు ఇప్పటికే సరఫరా చేశారు. దీంతో మండల విద్యాశాఖకు చెందిన సిబ్బంది వీటిని పాఠశాలలకు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక కమిటీల నేతృత్వంలో పంపిణీ కార్యక్రమం సజావుగా సాగి పాఠశాలలకు కొత్త పాఠ్యపుస్తకాలు అందజేసేందుకు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 20 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు,14 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. వీటిలో విద్యను అభ్యసిస్తున్నన్న 3,332 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాల్సి ఉంది. అయితే మొదటి విడత కింద ఇప్పటికే మండల స్టాక్ పాయింట్ కు 16,200 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఒకటో తరగతి మినహా మిగిలిన తరగతుల నుంచి ప్రమోషన్ పొందిన విద్యార్థులు పై తరగతికి వెళ్లనున్నారు. ఇందులో ప్రతి ఒక్కరికి మిత్ర కిట్లు అందజేయనున్నారు. ఇందులో పాఠ్యపుస్తకాలు, దుస్తులు, బెల్టు, బూట్లు ఉన్నాయి. ప్రస్తుతం మండల స్టాక్ పాయింట్ కు వచ్చిన పాఠ్య పుస్తకాలను సిబ్బంది సరిచూస్తున్నారు. వారంలోగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పేరిట అందించే కిట్లలో మిగిలినవి వస్తాయి. పాఠశాల పునః ప్రారంభమైన తొలిరోజునే వీటిని విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రజల విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 1 (శుభోదయం న్యూస్) : కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిస్థాయిలో కోల్పోయిందని వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షులు నైరుతి రెడ్డి కూటమి ప్రభుత్వ అవలంబిస్తున్న విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు శనివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేట్రేగిపోతున్న అన్యాయాలు అక్రమాలు దౌర్జన్యాలుతో ప్రజలు పూర్తిస్థాయిలో విసిగి పోయారన్నారు తమ నిరంకుశ పాలనతో ప్రజలను వేధిస్తుందని అందుకు నిరసనగా వైఎస్సార్ సీపీ పార్టీ జూన్ 4న వెన్నుపోటు దినాన్ని పాటించేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు ఇందులో భాగంగా ఆదివారం ఉదయం వైయస్సార్సీపి కార్యాలయంలో 9:30 గంటలకు వెన్నుపోటు గోడపత్రికలను మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు గ్రామ సర్పంచ్లు మండల నాయకులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు అందరూ భారీ స్థాయిలో కదలి రావాలన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో గోడపత్రికలు విడుదల



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 1 (శుభోదయం న్యూస్) : జూన్ రెండో తేదీన సిపిఐ ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శనివారం గోడపత్రికలను విడుదల చేశారు ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూఅర్హులైన పేదలందరికీ పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇవ్వాలిఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని జూన్ 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని ఈరోజు సిపిఐ గుంతకల్ కార్యాలయం నందు గోడపత్రిక విడుదల చేయడం జరిగింది.. సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు గోవిందు నియోజక వర్గం కార్యదర్శి వీరభద్రస్వామి సహాయ కార్యదర్శి మహేష్ సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ మండల కార్యదర్శి రాము ఏఐటీయూసీ మండల అధ్యక్షులు సురేష్ కార్యదర్శి ఈశ్వరయ్య ఉపాధ్యక్షులు మల్లయ్య కత్తి శ్రీనివాసులు సిపిఐ నాయకులు కొట్టాల బాషా ములకలపెంట గోవిందు చెన్నకేశవులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెడబలిమి వారి పెళ్లిసందడిలో పాల్గొన్న ఇంచార్జి దద్దాల



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండలం మోట్రావులపాడు గ్రామం లో మెడబలిమి ముసలయ్య (టీచర్),నాగార్జునమ్మ గార్ల కుమార్తె సరోజిని పెళ్లిసందడిలో పాల్గొని నూతన వధువుని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసిన వైయస్ఆర్ సీపీ కనిగిరి ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్..ఈ కార్యక్రమంలో మండల నాయకులు గంగసాని హుస్సేన్ రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి, మడతల కస్తూరి రెడ్డి,మెడబలిమి గురవయ్య, మెడబలిమి బ్రహ్మయ్య, కర్లపూడి తిరుపాలు,కర్లపూడి లింగయ్య, కర్లపూడి నారాయణ, మెడబలిమి వెంకట కొండయ్య, మెడబలిమి వెంకటేశ్వర్లు, శ్రీరామ



శ్రీనివాసులు, ఎలిక అచ్చయ్య,మూలే రాజశేఖర్ రెడ్డి, మన్నెం మాధవ తదితరులు పాల్గొని ఆశీర్వదించారు..

## వేసవిలో సాగుచేసిన పత్తి పంటను సందర్శించిన వ్యవసాయ అధికారి




దోర్నాల, మండల రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్ ) : దోర్నాల మండలం ప్రకాశం జిల్లా ఈ రోజు అనగా తేది :31.05.2025న దోర్నాల మండలం లోని చిన్నదోర్నాల గ్రామంలో వేసవిలో సాగు చేసిన పత్తి పంటనుమండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ సందర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటలో మెగ్నీసియం లోపం ఉన్నట్లు గమనించడం జరిగింది. ఈ లోప నివారణకు మెగ్నీసియం సల్ఫేట్ 10 గ్రాములు 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలనీ రైతులకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం. రాజేంద్ర ప్రసాద్, మరియు చిన్న దోర్నాల రైతులు పాల్గొన్నారు.

## జనసేన తోనే మా ప్రయాణం సభ్యత్వం స్వీకరించిన ఎస్సీ నాయకుడు నన్నముడి బాబురావు



(శుభోదయం న్యూస్): జనసేన పార్టీ నాయకులు సాయి చేతుల మీదుగా సభ్యత్వం కార్డుని స్వీకరించిన జనసేన పార్టీ సీనియర్ ఎస్సీ నాయకుడు నన్నముడి బాబురావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి కొణదల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నడవడానికి మేము సిద్ధంగా ఉన్నామని, పదవుల కోసమైతే కాదని ఆ రోజున చిరంజీవి అన్న మీద ఉన్న అభిమానం ఈరోజు పవన్ కళ్యాణ్ పార్టీ మీద ఉందని, పార్టీ ఆశయాలకు కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా తెలియజేస్తున్న బాబురావు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం ఉదయం పంపిణీ చేశారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలోని శనివారం ఉదయం లబ్ధిదారుల వద్దకు వెళ్లి వితంతు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్న ఆయన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కింది అన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు :యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : గన్నవరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అధ్వాన్నంగా ఉన్న అంతర్గత రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత గ్రామంలో నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం, పినైనవరం గ్రామాల్లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ, మండల పరిషత్ నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను శనివారం ఉదయం యార్లగడ్డ ప్రారంభించారు. అంబాపురం గ్రామంలోని పి.హారిక ఇంటి వద్ద నుండి వై.చలపతి కుమార్ ఇంటి వరకు రూ.50 లక్షలతో, పీ.నైనవరం గ్రామంలో డి.రంగా బ్యాంకు నుండి గంప శ్రీనివాసరావు ఇంటి వరకు రూ.25 లక్షల ఖర్చుతో, ఇదే గ్రామంలోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి పి.వెంకటేశ్వర ఇంటి వరకు రూ.20.25 లక్షల ఖర్చుతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు రాష్ట్రంలోని రోడ్లను నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా గోతుల మయంగా మారటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు యార్లగడ్డ చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు ఇప్పటికే పలు గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీరోడ్లు గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నైరుతి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తాయి అన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదలు సంభవిస్తే అంటువ్యాధులు ప్రజలే ప్రమాదం ఉన్నందున వాటి నివారణపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది దృష్టి సారించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ పి.నైనవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షులు గొద్దళ్ల చిన్న రామారావు, అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య, టిడిపి నాయకుల రామకృష్ణ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వీరపనేని గూడెంలో ఘనంగా కాశీవలి షేక్ పెళ్లి వేడుకలు



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) :ఉమ్మడి కృష్ణ జిల్లా, గన్నవరం నియోజకవర్గం, గన్నవరం మండలం, వీరపనేని గూడెం గ్రామ తెలుగుదేశం కార్యకర్త షేక్ అమీర్, ఆహ్వానం మేరకు నూతన వధూవరులను వరుడు షేక్ ఖాసిం వలి, వధువు సుహానా లను ఆశీర్వదించిన గన్నవరం మార్కెట్ కమిటీ చైర్మన్ జనసేన నాయకులు గరికిపాటి శివశంకర్,ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు షేక్ కరీముల్లా,పఠాన్ నాగుర్ బాజీ, పఠాన్ జిలాని, పఠాన్ సుభాని, తెలుగుదేశం సీనియర్ నాయకులు%ం% జనసేన కార్యకర్తలు స్థానిక బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరం లో ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జన్మదిన వేడుకలు



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) :సినిమా రంగంలోనే సూపర్ స్టార్ కృష్ణ కు ప్రత్యేక గుర్తింపు దక్కిందని కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు ఎంవి గిరి,ఏవి రావు లు అన్నారు.గన్నవరం లోని బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో సినీ??? హీరో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య పాల్గొని కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ అభిమానుల క్రీడాకారులను,అభిమానుల చిత్ర రంగంలో ఉన్నవారిని గుర్తు పెట్టుకుని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. ప్రముఖ న్యాయవాది తిరివీధి వెంకయ్య మాట్లాడుతూ ప్రజలకు ఒక సందేశాన్ని అందించే కృష్ణ ద్వారా వచ్చాయని అన్నారు..అనంతరం చర్మ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, ప్రముఖ డాక్యుమెంటరీ రైటర్ కెవిఆర్ కిషోర్,కుంట ముక్కల రాజేష్, ఇందుపల్లి శోభనాద్రి, మాజీ పోలీస్ అధికారి వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు

## . పార్టీలకు అతీతంగా గిరిజనుల అభివృద్ధికి కృషి చేయండి... సీనియర్ గిరిజన నేత, మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): రాష్ట్రంలో ని గిరిజనుల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా కృషి చేయాలని సీనియర్ గిరిజన నేత, మాజీ జడ్పిటిసి నారాయణ నాయక్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా కమిటీ సభ్యులుగా ఎన్నికైన వెంకటపతి కి తెలిపారు. శనివారం కెపి గుడిసెలలోనే వెంకటపతి నివాసానికి వెళ్లి ప్రభుత్వ గిరిజన సలహా కమిటీ సభ్యులుగా ఎన్నికైన వెంకటపతి ను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణ నాయక్ మాట్లాడుతూ తమ ప్రాంతానికి చెందిన వెంకటపతి కు ప్రభుత్వము ఇటీవల ఎంతో కీలకమైన గిరిజనల సలహా కమిటీ సభ్యులుగా నియమించడం తో వెంకటపతికి సన్మాన కార్యక్రమాన్ని చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ గిరిజన సలహాక కమిటీ సభ్యులు వెంకటపతి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులైన గిరిజనులకు అందించేందుకు, అలాగే వెనకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం తాను కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిరిజన ల అభివృద్ధి కోసం ముందుంటారని, అలాగే మన ప్రాంతంలో గిరిజన అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ కూడా ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు రాజు నాయక్, గిరిజన నాయకుడు రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గుండాల పంచాయతీలోనిరోడ్ల కొరకు 3వ రోజు గుండాల సచివాలయం వద్ద "రిలే నిరాహార దీక్షలు"

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గుండాల సచివాలయం వద్ద రోడ్ల కొరకు చేస్తున్న రిలే నిరాహార దీక్షను ఈరోజు గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నా ఎంపీటీసీ పరిధిలో రెండు పంచాయతీలు ఉన్నాయి. పురుషోత్తపట్నం పంచాయతీలో రోడ్ల నిర్మాణం పూర్తయింది. కానీ, గుండాల పంచాయతీ పరిధిలో రోడ్ల నిర్మాణం ఆగిపోయింది. గుండాల, గోళ్లగట్ట, కేఎన్పురం, ఎర్రబోరు తదితర గ్రామాల నుండి భద్రాచలం మీద ఆధారపడి జీవిస్తున్న ప్రజలు రోజువారీ పనుల కోసం రోజుకు రెండు, మూడు సార్లు అయినా భద్రాచలం వెళ్లి రావాల్సిన అవసరం ఉంటుంది. ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ ఈ రోడ్లపై ప్రయాణం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు గానీ, అధికారులు గానీ స్పందించట్లేదంటూ, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సిపిఎం పార్టీ చేస్తున్న ఈ పోరాటానికి మేము కూడా సంఘీభావం తెలుపుతున్నాం. అవసరమైతే సిపిఎంతో పోరాటాల్లో భాగస్వాములవుతామని అన్నారు. ఎంపిటిసి గారితో పాటు శశి, నర్సింహారావు, ఐ పద్మ, ఇరప అజయ్ కుమార్, జి హుస్సేన్, ఏర్పా సత్యం, తోట శ్రీను, ఎం సుధాకర్, పసుపులేటి ప్రవీణ్, మాట ప్రసాద్, పెనుబల్లి భీష్మారావు, బుద్ధుల కొండయ్య, కొరసా ముత్తయ్య, కల్లూరు వెంకట్రావు, బంటు నరేష్, తోట వెంకటరమణ గంట కొండమ్మ తదితరులు పాల్గొని ప్రారంభించినారు.

## వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు సీనియర్ తెలుగుదేశం నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ ఎండి జమాల్ ఖాన్ కొంతమూరులో యు ఆర్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న జమాల్ ఖాన్ బుచ్చయ్య చౌదరి లకు పూలమాలలు వేసి పూలను చల్లుతూ ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రాగునీరు స్వచ్ఛమైన అన్ని విలువలు ఉన్న నీటిని ప్రతి ఒక్కరు అధిక శాతం లో తీసుకోవాలని ఆరోగ్యం మంచి త్రాగునీటి పైన ఆధారపడి ఉందని కలుషిత నీరు అనారోగ్యాలకు దారితీస్తుందని ప్రతి ఒక్కరు సురక్షితమైన నీటిని సేవించి ఆరోగ్యాలను కాపాడుకోవాలని అన్నారు. వర్షాకాలంలో బావుల్లో నీరు కాలువల్లో నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని వ్యాధులు ఈ కాలంలోనే అధికంగా విజృంభిస్తాయని దాని పట్ల అప్రమత్తత వహించాలని అన్నారు. అనంతరం ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగింది గోదావరి జలాలను కొంతమూరుకు అందించాలని ఎమ్మెల్యేలు ప్రజలు అభ్యర్థించారు దానికి ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులు తో సంప్రదించి ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నున్న కృష్ణ, రూరల్ కొంతమూరు పంచాయతీ అధ్యక్షులు పిన్నమనేని ఈశ్వరుడు, సీనియర్ నాయకులు ఉండవల్లి బంగారు రాజులు, నూర్ భాషా సాధికార కమిటీ కన్వీనర్ గన్నవరం షేక్ సుభాన్, వాటర్ ప్లాంట్ నిర్వాహకులు సయ్యద్ ఇస్మాయిల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

కొర్రపాడు గ్రామానికి చెందిన అరుగుల వన్నూరప్ప(బొట్టు) కుమారుడు ఆంజనేయులు కు రాజేశ్వరి వివాహం జరిగింది.వివాహానికి ఎడిసిసి చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్ప గారి రామలింగారెడ్డి అనంతపురం జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్ బాబు మండల కన్వీనర్ అశోక్ కుమార్ ఎస్ నారాయణస్వామి మల్లేశు తలారి ఆది నరేంద్ర యాదవ్ ఆది యాదవ్ వడ్డే రామకృష్ణ నాగేంద్ర హాజరయ్యారు .నూతన వధూవరు వహులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో అరిగెల రాజు తదితరులు పాల్గొన్నారు.

## విషయం: ఎస్సీ గురుకుల పాఠశాలలలో వివక్ష పద్ధతులపై ఆందోళన

ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి చేసిన వ్యాఖ్యలువిద్యార్థులు తమ స్వంత గదులు మరియు టాయిలెట్లు శుభ్రం చేసుకోవాలన్న నిబంధనతీవ్ర స్పందనను తెచ్చాయి. సీనియర్ నేత ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ వ్యాఖ్యల్ని తీవ్రంగా వ్యతిరేకించారు, ముఖ్యంగా ఎస్సీ విద్యార్థులపై చూపుతున్న వివక్షతను ప్రశ్నిస్తూ. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఒక కీలకమైన ప్రశ్నను లేవనెత్తారుఈ విధానం గురుకుల పాఠశాలలో సరైనదైతే, అదే విధంగా అన్ని పాఠశాలలో అమలుచేయకూడదా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పిల్లలు చదువుతున్న పాఠశాలలో కూడా ఇదే నిబంధన పాటిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. విద్యా విధానంలో ఈ ద్వంద్వ ప్రమాణాలు వ్యవస్థాపిత వివక్షకు సంకేతం అని భావించాల్సిన అవసరం ఉంది. అదనంగా, ఎస్సీ గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల సమస్యలపై చర్చించేందుకు ఎస్సీ సంక్షేమ కార్యాలయానికి వెళ్లినప్పుడు, వారిని పోలీసుల ద్వారా అడ్డుకోవడం ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ చర్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జరుగుతున్నాయనే ఆరోపణలు మరింత తీవ్రమయ్యాయి, దీని వల్ల సామాజిక వివక్ష పై మరింత ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా, నాయకులు మరియు సామాజిక కార్యకర్తలు సమానత్వం మరియు గౌరవాన్ని అందరికీ కలిగించే

## తుగ్గలి లో ఘనంగా పెన్షన్ పంపిణీ...
## పెన్షన్ దారులకు పెన్షన్ అందజేసిన తుగ్గలి నాగేంద్ర..



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల కేంద్రమైన తుగ్గలిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారము శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర వివిధ రకాల పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల కోసం ఏ రాష్ట్రంలోని విధంగా ఆంధ్రప్రదేశ్లో నాలుగువేల రూపాయల పెన్షన్ అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. మరో మారు ముఖ్యమంత్రి అయితే పెన్షన్ దారులకు 5000 రూపాయలు అర్థించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి ప్రసాద్,పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఆరోగ్య కార్యదర్శి మహాలక్ష్మి, లోహిత్ కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు
## చిత్రపటానికి రేషన్ షాప్ డీలర్లు పాలాభిషేకం...




తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్): మండల కేంద్రమైన తుగ్గలి తహసిల్దార్ కార్యాలయ ఆవరణములో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ప్రభుత్వ రేషన్ షాప్ డీలర్లు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాప్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు పగిడిరాయి సుంకన్న, గౌరవ అధ్యక్షులు ఎర్రగుడి చంద్రశేఖర్ యాదవ్ లు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి ఉన్న డీలర్ వ్యవస్థ ద్వారా పేద ప్రజలు బియ్యం వేయించుకొని వెళ్లేవారని తెలిపారు.అయితే గత ప్రభుత్వంలో పాలకులు కేవలం కొందరికి ఉపాధి కల్పించేందుకు కోసం డీలర్ వ్యవస్థను విచ్ఛిన్నం చేసి ఎండియు వాహనాలు ద్వారా ప్రజలకు బియ్యం వేయించారని వారు ఆరోపించారు. దీని ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆర్థిక భారం పడిందన్నారు. అందువల్ల ఎవరికి ఇబ్బంది లేకుండా మరల డీలర్ వ్యవస్థ ద్వారా షాప్ దగ్గరే రేషన్ తీసుకు వెళ్లే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత కొన్ని ఏళ్ళు ఉన్న డీలర్ వ్యవస్థను పునః ప్రారంభించి ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ రేషన్ షాప్ డీలర్లు రామచంద్రారెడ్డి, గౌరన్న, తిమ్మప్ప, రామచంద్ర, వెంకటేశ్వర్ రెడ్డి, రంగనాయకులు, బసవరాజు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాంపల్లిలో లో ఘనంగా పెన్షన్ పంపిణీ...
## పెన్షన్ దారులకు పెన్షన్ అందజేసిన
## టిడిపి మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని రాంపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారము టిడిపి మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు వివిధ రకాల పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల కోసం ఏ రాష్ట్రంలోని విధంగా ఆంధ్రప్రదేశ్లో నాలుగువేల రూపాయల పెన్షన్ అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. మరో మారు ముఖ్యమంత్రి అయితే పెన్షన్ దారులకు 5000 రూపాయలు అర్థించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కోతకు గురైన భూములపై సీఎం దృష్టికి తీసుకెళ్లిన
## రాజంపేట టిడిపి పార్లమెంట్ కార్యదర్శి నాగ ముని రెడ్డి



సిద్ధవటం, మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): సిద్ధవటం మండలంలోని పెన్నా ఒడ్డున ఉన్న భూములుపెన్నా వరద బీభత్సంలో లింగంపల్లి, కడ పాయ పల్లె గ్రామాలకు చెందిన రైతుల భూములు పెన్నా వరద బీభత్సంలో వరద నీటి ప్రభావం వల్ల పెన్నా నది ఆనుకొని ఉన్న రైతుల భూములు కోతకు గురి కావడంతో రాజంపేట టిడిపి పార్లమెంట్ కార్యదర్శి నాగ ముని రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా టిడిపి పార్లమెంట్ కార్యదర్శి నాగ మునిరెడ్డి మండల కేంద్రమైన సిద్ధవటంలో శనివారం మాట్లాడుతూ రాయలసీమ గడ్డ కడపలో జరిగిన మహానాడు కార్యక్రమంలో భాగంగా మే 28 తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి పెన్నా నది వరద బీభత్సంలో కోతకు గురైన లింగంపల్లి కడ పాయపల్లె రైతుల భూముల విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్లామని కోతకు గురైన భూముల రైతుల వివరాలు సర్వే నెంబర్లతో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందజేయాలని సీఎం సూచించినట్టు తెలిపారు, జ్యోతి, ఖాదర్ బంగ్లా పెన్నా నదిపై వంతెన నిర్మాణం పనులపై సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు రాజంపేట టిడిపి పార్లమెంట్ కార్యదర్శి నాగ ముని రెడ్డి తెలిపారు.

## యన్.టి.ఆర్ పశు వైద్య కళాశాలలో
## 15వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా





గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) :కృష్ణా జిల్లా గన్నవరం మండలం, గన్నవరం కళాశాల అసోసియేట్ డీన్, ప్రొ. పి.వి.యెస్. కిషోర్ వార్షిక నివేదన చేస్తూ కళాశాల ఉన్నతికి తోడ్పడుతున్న అందరిని గుర్తుకు తెచ్చుకొని మరింత ఉన్నతికి కృషి చేస్తామని పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన యార్లగడ్డ వెంకటరావు మాట్లాడుతూ శాస్త్ర సంబంధ విషయాలలో నిపుణత సాధించడం ద్వారా భవిష్యత్తులో వృత్తిపరమైన విజయాలు సాధించవచ్చు మరియు పశు వైద్య విద్య అభ్యసించడం వల్ల మంచి ఫలితాలను సాధిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ మరియు విద్యార్థి సంబంధ అధికారి జె వి రమణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వివిధ క్రీడలు సాంస్కృతిక రంగాల్లో ప్రవేశం పొందడం ద్వారా వికాసం పొందవచ్చని అన్నారు. విశ్వవిద్యాలయ డీన్, ప్రొ. కే. వీర బ్రహ్మయ్య మాట్లాడుతూ వృత్తి సంబంధమైన విషయాలలో పరిణితి సాధించడం ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు విద్యార్థినులకు బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందికి క్రీడలు సాంస్కృతిక విభాగాల్లో పలు బహుమతులు అందజేశారు. .పి.ఏ. కొండలరావు అత్యధిక అటెండన్స్ బహుమతిని 2023-2024 విద్యా సంవత్సరంగాను చైత్ర మంజీర కరణం (ఇంటెర్న్షిప్), చింతాడ తిరుమల (నాల్గవ సంవత్సరం), కొగంటి యశ్వంత్ (తృతీయ సంవత్సరం), శంఖుల షణ్ముకేశ్వర్ (ద్వితీయ సంవత్సరం) మరియు బండి నాగ పావని (మొదటి సంవత్సరం) పొందారు. కళాశాల ఛాంపియన్లుగా విధ్యార్థి విభాగంలో జి. శివ ప్రసాద్, విధ్యార్థిని విభాగంలో యం. సుకన్య, ఓవరాల్ చాంపియన్స్ గా 2021 బ్యాచ్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కళాశాల అసోసియేట్ డీన్, ప్రొ. పి.వి.యెస్. కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిహెచ్. వెంకట శేషయ్య, విద్యార్థి సంబంధ వ్యవహారాల అధికారి, వ్యాయామ ఉపాధ్యాయురాలు బి. కృష్ణ దీపిక, ప్రొఫెసర్లు శ్రీనివాస కుమార్, అనిల్, మస్తాన్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి
## ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు

సిద్ధవటం, మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని శనివారం మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ లైన్ క్రాస్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాల నడపాలని ఆటో వాహనాల్లో మితిమీరిన ప్రయాణికులను తరలించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయని తెలిపారు సైబర్ నేరగాళ్లు పట్ల అప్రమత్తంగా ఉండాలని యాప్ డౌన్లోడ్ చేస్తే మీ అకౌంట్లో డబ్బులు పడతాయని మోసాలు చేస్తున్నారని అలాంటి వారి నమ్మి మోసపోవద్దు అని రాష్ట్ర ప్రభుత్వం ఏదో ఒక సంక్షేమ సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలకు పథకాలు అందిస్తున్నారని ఉచితంగా డబ్బులు పడతాయని సైబర్ నెరగాళ్ల మాటలు విని మోసపోవద్దని అవగాహన కల్పించామని సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్సై మహమ్మద్ రఫీ ఏ ఎస్ ఐ సుబ్బరామచంద్ర, బాబయ్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చిన మండల ఎస్సై



సిద్ధవటం, మండల విలేకర్ - జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి శనీశ్వర స్వామి గుడి సమీపాన హైవే రోడ్డుపై వాహనాలకు అడ్డంగా నిలబడుతూ దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల వాహనాలకు ఇబ్బందికరంగా చేయడంపై స్థానిక ప్రజల నుండి ఫిర్యాదు రావడంతో శనివారం మండల ఎస్సై మహమ్మద్ రఫీ హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చామని మండల ఎస్సై తెలిపారు.వాహనాలకు అడ్డంగా నిలబడి ప్రయాణికులకు ఇబ్బంది పెడితే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ మొహమ్మద్ రఫీ తెలిపారు.

## సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్బంగా అన్నదానం



ఒంగోలు, శుభోదయం న్యూస్: సూపర్ స్టార్, నటశేఖర కృష్ణ జయంతి కార్యక్రమం ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం ఆవరణలో కృష్ణ అభిమాన సంఘ నాయకుడు జాలాది మోహన్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాస రావు మాట్లాడుతూ భారతీయ సినీ చరిత్రలో కృష్ణ తన పేరు సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారనీ, ఆయన స్థానం ఎప్పటికీ చెరిగిపోనిదిది, ఎన్నటికీ మాసిపోనిదని ఆయన స్ఫూర్తి తోనే నేను రాజకీయాలలోకి వచ్చానని అతి త్వరలో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ ఒంగోలు లో జరుగుతుందని అన్నారు. అయన మాట్లాడుతూ తేనె మనసులు చిత్రంతో కృష్ణ మంచి పేరు తెచ్చుకున్నారని ఆయన సంభాషణలు పలికేతీరు,హావభావలు ప్రదర్శించేప్రదర్శించే విధానం, ఆహార్యం వంటి విషయాల్లో ఆయన తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ అశేష అభిమానులకు దగ్గర చేసిందని, మోసగాళ్ళకు మోసగాడు చిత్రం తో ప్రపంచ వ్యాప్తంగా భారతీయ సినిమా గొప్పదనాన్ని ప్రపంచానికి చాటారని మంత్రి శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమం లో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సామాజిక వేత్త మారెళ్ళ సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగింది. శివం నిత్య అన్నదానం ద్వారా ఒంగోలు నగరంలో వందలాది మందికి సూపర్ స్టార్ కృష్ణ అభిమానుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొఠారి రాము, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, ఉలిచి బాబురావు,పాలేటి కోటేశ్వరరావు, మల్లవరపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు కావేటి వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, కె రాము. పి శ్రీనివాసరావు, మల్లెల శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు
## సర్టిఫికెట్లు పంపిణీ చేసిన మండవ మురళీకృష్ణ

వేసవి సెలవుల్లో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులో శిక్షణ ఎంతగానో ఉపయోగపడతాయి :మారెళ్ల సుబ్బారావు..



ఒంగోలు, శుభోదయం న్యూస్: ఆర్ ఎస్ ఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు ఒంగోలు డిఆర్ఎం ఎం మున్సిపల్ హై స్కూల్ నందు విద్యార్థులకు ఏప్రిల్ 28వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు ఉచితంగా సమ్మర్ క్యాంపు నిర్వహించి నట్లు కమిటీ నిర్వాహకులు చిక్కాల కిరణ్ కుమార్ తెలిపారు. ఆటలు పోటీలో విజేతులకు రాష్ట్ర కమ్మ సేవ సమాఖ్య చైర్మన్ మండవ మురళీకృష్ణ బహుమతులు అందజేశారుఈరోజు సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు



మారెళ్ళ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి శిబిరాలు విజ్ఞానదాయకమని తెలిపారు. ఈ వేసవికాలములో విద్యార్థులు టివి,సెల్ ఫోన్ లకు బానిసలు కాకుండా వారిలోని సృజనాత్మకతను బయటకి తీయడానికి సెల్ఫ్ డిఫెన్స్ సైన్స్ ప్రయోగాలు మిచ్చన్ మార్షల్ ఆర్ట్స్ డైనమిక్ ఫిట్నెస్ తో పాటుఆటలు యోగ నేర్పించడం మహనీయుల జీవితాలను పరిచయం చేయడం జరిగింది అని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డేంపూడి సుజాత రావు సేవ్ ది అనిమల్ ఫౌండేషన్ ప్రతినిధులు తాడిపత్రి దివ్య. కోసూరి శ్రీదేవి మండవ సుబ్బారావు గోపి. ఏడు కొండలు మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## ఒక జనసేన పార్టీ నాయకుడిగా నిరుపేదలకు
## ఉచిత సేవ చేస్తా : బీసీ జనసైనికుడు నరసింహ



(శుభోదయం న్యూస్) : ఒక జనసేన పార్టీ నాయకుడిగా మాకు తోచినంత సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని దాంట్లో భాగంగానే నేను చిరంజీవుల కృష్ణమూర్తి కొడుకుగా గత 40 సంవత్సరాల నుంచి సీల్ రోడ్ సెంటర్లో చింత చెట్టు కింద 20 సంవత్సరాలు బార్బర్ షాప్ పనిచేసి, బాపట్ల ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కృష్ణమూర్తి కొడుకు జనసేన పార్టీ బీసీ రాష్ట్ర నాయకులు నరసింహ రావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాపట్ల లో నిరుపేదలైనటువంటి వృద్ధులకు దివ్యాంగులకు ఉచితంగా బార్బర్ పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఇప్పుడు కూడా చేస్తున్నానని ఈ సందర్భంగా తెలియజేస్తూ, జనసేన పార్టీ అధినేత కొణదల పవన్ కళ్యాణ్ ఏ ఆశయాలతో పార్టీని నడిపిస్తున్నాడో, మేము కూడా సాటివారికి సహాయపడటానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## మర్లపూడి గ్రామ రేషన్ డీలర్ పై
## అధికారులకు అంత మమకారం ఎందుకు?



నెల్లూరు జిల్లా ప్రతినిధి - శ్రీనివాసులు (శుభోదయం న్యూస్): నెల్లూరు జిల్లా సైదాపురం మండలం మర్లపూడి గ్రామంలో రేషన్ షాప్ నెంబర్.0933019 నడుపుతున్న వరదబండి నరసా రెడ్డి అనే వ్యక్తి రేషన్ షాప్ నడుపుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని సమాచారం మేరకు 13.03.2025 లో రెవెన్యూ అధికారులు నేరుగా తనిఖీలు నిర్వహించి ప్రజలకు ఇచ్చే రేషన్ స్టాక్ లో తేడాలు వున్నట్టు సాక్ష్యాలుతో సహా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని సస్పెండ్ ఆర్డర్ ఇచ్చివున్నారు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టార్గెట్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ 2018 యొక్క 25(డి)నిబంధనలు ఉల్లంగించడం ద్వారా స్టాక్ ను బ్లాక్ మార్కెట్ కు మళ్ళించినట్లు దీంతో 1955 ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ సెక్షన్ 6ఏ ప్రకారం చర్యలు తీసుకున్నట్టు అధికారులు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు,అయినా అతనితోనే రేషన్ ను కొనసాగించేలా ప్రభుత్వ అధికారులు అనుమతులు ఇచ్చారనీ స్థానికులు గ్రామస్తులు పెద్ద ఎత్తున సైదాపురం ఎం ఆర్ ఓ ని కలిసి రేషన్ షాప్ లో సమస్యలు పై వివరించినా సమస్య పరిష్కారం కాక పోవడం తో సుమారు 100 మందికి పైగా గిరిజనులు,గ్రామస్తులు నేరుగా నెల్లూరు ఆర్డీఓ నాగ అనూషను కలిసి తమ సమస్యను వివరించగా కచ్చితంగా విచారించి సమస్య పరిష్కారం చూపుతామని రేషన్ డీలర్ ను తొందరలో మారుస్తా అని మార్లపూడి గ్రామస్థులకు మాట ఇచ్చారు. దీంతో ఆర్డీఓ మాట ఇచ్చారు తమ సమస్య తీరుతుందని సంతోషపడిన గ్రామస్థులు ఆనందం ఎండమావి లా మారిపోయింది. రోజులు గడుస్తున్నా రేషన్ డీలర్ ను మార్చక పోవడం తో గ్రామ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు, నరసారెడ్డి నే రేషన్ డీలర్ గా కొనసాగిస్తే తాము రేషన్ తీసుకోకుండా బాయ్ కాట్ చేస్తామని తమ నిరసన మరింత ఉధృతం చేస్తామని తెలియచేస్తున్నారు...ఇదే సమయం లో మళ్ళీ రేషన్ డీలర్ గా నరసారెడ్డి కొనసాగేలా అధికారులు మరోమారు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం తో ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తం అవుతుంది.

# పదవి విరమణ పొందిన జాడ అంజయ్య



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వెంకటాపురం యందు జాడ అంజయ్య ఆఫీస్ సబార్డినేట్ 35 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తూ 31.05.2025 శనివారం రోజున పదవీ విరమణపొందారు.దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు వారి సేవలను కొనియాడారు. మంచితనానికి, సహనానికి మారుపేరుగా ఉండేవారని అర్చక, సిబ్బంది సాదరంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు, కుటుంబ సభ్యులు, అర్చక,సిబ్బంది, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లవి మోడల్ స్కూల్ లో సక్షమ్ 2025 కాన్ఫిరెన్స్ సమ్మిళిత విద్య ఆకాంక్ష నుండి అమలు వైపు సాగాలి




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివ కుమార్, (శుభోదయం న్యూస్),మే 31: విద్యావేత్తలు, సంస్థలు సమాజాలు ఒకే దృక్పథం కింద ఐక్యమైనప్పుడు ఏమి సాధించవచ్చో సాక్షం 2025 నిదర్శనంగా నిలిచింది. అందరికీ విద్య, ప్రతి బిడ్డకు గౌరవం థీమ్ కార్యక్రమం శనివారం తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి విజయలక్ష్మి సాగర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సక్షమ్ బృందం లో స్కూల్ టీచర్స్, పాఠశాల ఇతర సిబ్బంది మద్దతుగా నిలించిందని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.పల్లవి మోడల్ స్కూల్ తిరుమలగిరి శాఖ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం చాలా అభినందనీయమని ముఖ్య అతిథి హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) కాదిరావన్ పలని తెలిపారు. న్యూరోడైవర్సిటీ తో బాధ పడుతున్న పిల్లల పట్ల పల్లవి మోడల్ స్కూల్ చూపిస్తున్న చొరవ, ప్రత్యేక శ్రద్ధ ప్రశంసనీయమని, వీరిని రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు ఆదర్శంగా తీసుకుని ప్రతి పాఠశాల, కళాశాలలు ఇలాంటి విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఇలాంటి స్పెషల్ కిడ్స్ లో కూడా ఏదో ఒక ప్రత్యేకత ప్రతిభ కలిగి ఉంటారని దానిని గుర్తించి వారిలోని ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందన్నారు. ఇలాంటి విద్యార్థులపై సమాజంలో చిన్న చూపు ఉందని అలాకాకుండా వారిని కూడా సమాజంలో ఒక పౌరునిగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్ర్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. తమ పిల్లల పట్ల పల్లవి మోడల్ స్కూల్ చూపిస్తున్న చొరవను వారు అభినందించారు. మా పిల్లలను సమాజంలో గౌరవ స్థానంలో నిలపటానికి కృషి చేస్తున్నందుకు పల్లవి మోడల్ స్కూల్ చైర్మన్ మల్క కొమరయ్య, ప్రిన్సిపల్ విజయలక్ష్మి సాగర్, ఉపాధ్యాయులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సక్షమ్ కార్ర్యక్రం వల్ల తాము కూడా పిల్లలను ఎలా చదివించాలి, వారికి చదువు పట్ల ఎలాంటి శ్రద్ధ తీసుకోవాలో ఇక్కడి వచ్చిన వక్తలు కొత్త విషయాలు తెలిపారని, ఈ కార్ర్యక్రమం తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడుతుందని, ఇలాంటి కార్ర్యక్రమాలు అన్ని పాఠశాలలో నిర్వహిస్తే స్పెషల్ స్టూడెంట్స్ పట్ల ఇతర విద్యార్థులు కూడా ఎలా ఉండాలో, ఎలా స్నేహం చేయాలో తెలుస్తుందని తల్లిదండ్రులు తెలిపారు.

## ల్యాదెల్లలో ఏర్పాటు చేయనున్న మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్):దామెర మండలం ల్యాదెల్లలో ఏర్పాటు చేస్తున్న మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.ల్యాదల్లలో సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఆత్మకూరు,దామెర, నడికూడ, పరకాల రూరల్ %ట%టౌన్ మహిళలకు అందుబాటులో ఉంటుందని అన్నారు.స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ప్రతి ఇంట్లో ఒకరికి ఉపాధి అవకాశాలు పొందుతారని, త్వరలో దామెర మండల కేంద్రంలో డైరీ సెంటర్ ను కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

## ఉద్యోగ విరమణ అనివార్యం తిరుమలగిరి ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎర్రి స్వామి



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్)మే 31: ఉద్యోగ విరమణ అనివార్యమని తిరుమలగిరి ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎర్రి స్వామి అన్నారు. శనివారం తిరుమలగిరి ఆర్టిఏ కార్యాలయంలో సిబ్బంది శ్రీహరి పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆర్టిఏ ఎర్రి స్వామి, సిబ్బందితో కలిసి శ్రీహరిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఆర్టీఏ ఎర్రి స్వామి శ్రీహరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు,ఆర్టీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెల్పూర్ 2011-2012 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం









హుజురాబాద్ నియోజకవర్గం ప్రతినిధి దిడ్డి మధు (శుభోదయం న్యూస్) మే- 31:కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం లోని చెల్పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2011-12 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఘనంగా గురుశిష్యుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. 13 సంవత్సరాల తరువాత కలుసుకున్న మిత్రులు ఒకరిని ఒక్కరు పలకరించుకొని పులకించిపోయారు. పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందం వ్యక్తం చేసారు. దాదాపు 40 మంది పూర్వ విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఈ కార్యక్రంలో గురువులను కార్యక్రానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు గతంలో గురుశిష్యుల మధ్యలో జరిగిన ఆహ్లాదకరమైన సన్నివేశాలను గుర్తుచేసుకున్నారు చిందులు వేశారు అలాగే గురుశిష్యుల కలసి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమానికి గురువులు కొండల్ రెడ్డి, రమణ రెడ్డి, సత్యం, వెంకటేశ్వర్లు, సునీత, సాంబయ్య, లింగయ్య, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## జూన్ 2 నుండి ప్రారంభం కానున్న వంద రోజుల కార్యచరణ ప్రణాళిక విజయవంతంగా అమలు చేయాలి

### రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ ఎ సి) అరుణ శ్రీ



రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్):జూన్ 2 నుండి ప్రారంభం కానున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) అరుణ శ్రీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ



ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుండి సెప్టెంబర్ 10 వరకు వంద రోజుల పాటు చేపట్టనున్న వివిధ కార్యకలాపాలపై శనివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వరదలు , అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో నిర్దేశించిన పారిశుద్ధ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి ఇంటి నుండి తప్పనిసరిగా చెత్త సేకరించడం , ప్రజా మరుగు దొడ్ల పరిశుభ్రంగా ఉంచడం , ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డే చేపట్టడం , చెత్త నిలువ వుండే ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయించడం , నాలాల్లో పూడిక తీత , మొక్కలు నాటడం ,శిధిలావస్థలో ఉన్న కట్టడాల తొలగింపు , పైపుల ద్వారా సురక్షిత మంచి నీరు సరఫరా జరిగేలా చూడడం తదితర అంశాలకు ఈ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికాలో ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నగర పాలక సంస్థ కు ఆదాయ%శీ% పెంపొందించే చర్యలు చేపట్టడంలో భాగంగా అండర్ అసెస్మెంట్ , అన్ అసెస్మెంట్ లను, వాణిజ్య ఆస్తులను గుర్తించి పన్ను సవరింపు , లైసెన్స్ జారీ చర్యలు చేపట్టాలని అన్నారు. అర్హులను గుర్తించి కొత్త మహిళా స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయడం , బ్యాంకు లింకేజీ మంజూరు చేయడం , వీధి వ్యాపారులకు రుణాలు , వెండింగ్ జోన్ లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల్లో స్వచ్చత పట్ల అవగాహన పెంపొందించేందుకు కళాజాతాల ప్రదర్శన , ర్యాలీ లు తదితర అనేక ఐ ఇ సి కార్యకలాపాలు చేపట్టాలని అన్నారు . డివిజన్ లలో జరిగే ప్రతి కార్యక్రమంలో వార్డు అధికారులు భాగస్వాములు కావాలని అన్నారు. వంద రోజుల తరువాత నగరంలో మంచి మార్పు కనబడేలా సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ , డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , ఎస్ ఇ శివానంద్ , ఇ ఇ రామన్ , డి ఇ లు హన్మంత రావు నాయక్ , షాభాజ్ , జమీల్ , ఆర్ ఓ, ఆంజనేయులు , టి పి ఓ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ మెప్మా డి ఎం సి మౌనిక , సి ఓ లు , నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు , సిబ్బంది , వార్డు అధికారులు , సానిటరీ ఇన్స్పెక్టర్లు , జవాన్లు పాల్గొన్నారు.

## నేషనల్ రోవింగ్ చాంపియన్ షిప్ పోటిల్లో చిప్ప దాత్రి కి గోల్డ్ మెడల్







రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): హైదరాబాద్ హుస్సేన్ సాగర్ వేదికగా ఈ నెల 27 నుండి 31 వరకు జరుగుతున్న 26వ, సబ్ జూనియర్ నేషనల్ రోవింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో మాతంగి కాలనికి చెందిన చిప్ప దాత్రి అండర్ 13 విభాగం లో పోటీ పడి విజయం సాధించి గోల్డ్ మెడల్ దక్కించుకుంది. ఈ పోటీ ల్లో 23 రాస్ట్రాలనుండి 350 మంది పాల్గొన్నారు. అందులో తెలంగాణ నుండి 24 మంది పాల్గొన్నారు. హైదరాబాద్ డి ఏ వి పబ్లిక్ స్కూల్ లో 7వ, తరగతి చదువుతున్న ధాత్రి ని పలువురు అభినందనలు తెలుపుతున్నారు. తల్లి తండ్రులు చిప్ప నిరంజన్ శివ ప్రసాద్, తల్లి చిప్ప సుభాషిణి సంతోషం వ్యక్తం చేసారు.

## గోదావరిఖని బస్టాండు రోడ్డు సర్వీస్ రోడ్డు ప్రారంభోత్సవం

### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్): ప్రజల ప్రాణాలు కాపాడడం కోసమే అభివృద్ధిలో భాగంగా సర్వీస్ రోడ్ ఏర్పాటు చేస్తున్నారు మన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజా మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, రామాలయం చైర్మన్ గట్ల రమేష్, తాజా మాజీ కార్పొరేటర్ ముస్తఫా గారు అన్నారు. అభివృద్ధి అంటేనే రాజ్ ఠాగూర్ రాజ్ ఠాకూర్ అంటేనే అభివృద్ధి.హెచ్ కె ఆర్ వారి ఆధ్వర్యంలో గోదావరిఖని బస్టాండు రోడ్డు ఇరువైపులా సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రత్యేక



కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఫ్లోర్ లీడర్ మరియు కార్పొరేటర్ మహంకాళి స్వామి పాల్గొని సర్వీస్ రోడ్డు ప్రారంభించారు. ఈ కొత్త సర్వీస్ రోడ్డు బస్టాండ్ నుండి కవిత థియేటర్ వరకు విస్తరించి ఉంది, ఇది ప్రజల యొక్క ప్రయాణం కోసం మరింత సౌకర్యవంతమైన మార్గం కల్పిస్తుంది. గోదావరిఖని ప్రజలకు సౌకర్యాన్ని అందించడమే కాకుండా, నగరంలోని ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో కూడా ఈ ప్రాజెక్టు కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామాలయం చైర్మన్ గట్ల రమేష్, మాజి కార్పొరేటర్ ముస్తపా , అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు భాగస్వామ్యులుగా పాల్గొన్నారు. మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, రోడ్డు నిర్మాణం ప్రజల భద్రత, రవాణా సౌలభ్యం పెంచడంలో తోడ్పడనుందని పేర్కొన్నారు.మహంకాళి స్వామి ఈ సందర్భంగా మాట్లాడుతూ, గోదావరిఖని నగర అభివృద్ధి దిశగా అనేక ముందడుగులు వేస్తుంది. ఈ సర్వీస్ రోడ్డు ప్రారంభం ద్వారా ప్రజలకు ప్రయాణించడానికి మరింత సౌకర్యవంతమైన మార్గాలు అందుబాటులోకి రానున్నాయి, అని పేర్కొన్నారు. ప్రాజెక్టు కింద రోడ్డు విస్తరణతో పాటు, రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన చర్యలు కూడా తీసుకోబడుతున్నాయి. ఈ సర్వీస్ రోడ్డు పనులు సమయానికి పూర్తయ్యేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని హెచ్ కే ఆర్ ప్రతినిధి తెలిపారు.

## ఆర్ జీ వన్ సీనియర్ అసిస్టెంట్ జీదుల మనోహర్ పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానం



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్): ఆర్ జీ వన్ జీడికే లెవెన్ ఇంక్లైన్ లో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన జీదుల మనోహర్ ను అధికారులు కార్మికులు పూలమాలలు షాలువాలతో ఘనంగా సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా గని ఆవరణలోఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో గని మేనేజర్ మల్లేష్



మాట్లాడుతూ. జీదుల మనోహర్ గత 29 సంవత్సరాల క్రితం ఇదే గని లో అపాయింట్మెంట్ అయి ఇదే గనిలో రిటైర్మెంట్ అవ్వడం తాను సింగరేణిలో కార్మికులకు అందించిన సేవలు మరువ లేనివని ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం మనోహర్ ను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి వారికి రావలసినటువంటి బెన్ఫిట్ పత్రాలను అందజేశారు. వారి శేష జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని. ఆకాంక్షించారు. మాటలు. ఇంకా ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ మల్లేష్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్. వెంటిలేషన్ ఆఫీసర్ వసీం అక్రమ్ ఎల్ హెచ్ డి ఇంచార్జ్ పరశురాం. తో పాటుగా గుర్తింపు సంఘం నాయకులు నాయిని శంకర్ ఆరెల్లిపోషం సిద్ధమల్ల రాజు. నరేష్ తో పాటుగా అధికారులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సర్వేయర్

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం చంద్రంపేట గ్రామంలో జరుగుతున్న సర్వేయర్ల సమావేశంలో, అదే గ్రామానికి చెందిన వ్యక్తిని లంచం డిమాండ్ చేసిన సర్వేయర్ నాగరాజులంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

## ప్లానింగ్ సెక్రటరీ ఆండ తో అక్రమ అత్తస్తులు నిర్మాణం

యూనిట్ డీవియేషాన్ తో పాటు సెట్ బెక్ డివియేశన్ తో పైనా అక్రమ అత్తస్తులు నిర్మాణం... చోద్యం చూస్తున్న టవున్ ప్లానింగ్ విభాగం అధికారులు.. కొమ్ము కాస్తున్న వార్డ్ ప్లానింగ్ సెక్రటరీ 1086 479 కుమార్ ..!!

## అమెరికా రెట్టింపు సుంకాలతో భారత్‌పై తీవ్ర ప్రభావం



న్యూఢిల్లీ : ఉక్కు, అల్యూమినియంపై అమెరికా సుంకాలను రెట్టింపు చేయడంతో భారత ఎగుమతులు తీవ్రంగా ప్రభావితమవుతాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జిటిఆర్ఐ) శనివారం పేర్కొంది. ఈ చర్య భారత ఉత్పత్తిదారులు మరియు ఎగుమతిదారుల లాభదాయకతను దెబ్బతీస్తుందని జిటిఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ అన్నారు. భారత్‌పై ఈ పరిణామం ప్రత్యక్షంగా ఉంటుందని అన్నారు. ఈ సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా ఎగుమతులపై భారత్ ప్రతీకార సుంకాలను విధిస్తుందో లేదో చూడాలని అన్నారు. గతంలో విధించిన ఉక్కు సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలను విధించే ఉద్దేశాన్ని సూచిస్తూ భారత్ ఇప్పటికే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో అధికారిక నోటీసు జారీ చేసిందని అన్నారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 25శాతం సుంకాలను రెట్టింపు చేస్తానని అమెరికా అధ్యక్షులు ట్రంప్ శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. 1962నాటి అమెరికా వాణిజ్య విస్తరణ చట్టంలోని సెక్షన్ 232 కింద ఈ పెంపుదల చేశారు. విదేశాల నుండి దిగుమతులు జాతీయ భద్రతకు ముప్పుగా భావిస్తే అధ్యక్షులు సుంకాలు లేదా ఇతర వాణిజ్య పరిమితులను విధించడానికి ఈ చట్టం అనుమతిస్తుంది. 2018లో ఉక్కుపై 25శాతం, అల్యూమినియంపై 10శాతం సుంకాలను విధించేందుకు ట్రంప్ మొదట ఈ సెక్షన్‌ను వినియోగించారు. తిరిగి 2025 ఫిబ్రవరిలో ఉక్కు, అల్యూమినియంలపై సుంకాలను 25శాతానికి పెంచారు. 2024-25లో, భారతదేశం అమెరికాకి 4.56బిలియన్ డాలర్ల విలువైన ఇనుము, ఉక్కు మరియు అల్యూమినియం ఉత్పత్తులను ఎగుమతి చేసింది. వీటిలో 587.5 మిలియన్ డాలర్ల ఇనుము మరియు ఉక్కు, 3.1 బిలియన్ డాలర్లు ఇనుము లేదా ఉక్కు వస్తువులు మరియు 860 మిలియన్ డాలర్లు అల్యూమినియం మరియు సంబంధిత వస్తువులు ఉన్నాయి.

## పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ : సిఎం చంద్రబాబు



చెయ్యేరు : పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అని ఏపి సిఎం చంద్రబాబు అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరులో ముఖ్యమంత్రి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పింఛను మొత్తాన్ని పెంచామన్నారు. పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అని చెప్పారు. ప్రజల ఆదాయం పెంచి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అధిక పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. తమది పేదల ప్రభుత్వం అని, మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని తెలిపారు. పేదలకు మూడుపూటలా అన్నం పెట్టాలన్న సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ యంత్రాంగం పేదల గురించే ఆలోచించాలన్నారు. ప్రతి గ్రామానికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక నేతలు వెళ్లాలని అన్నారు. పింఛను ఇచ్చే కార్యక్రమంలో భాగస్వాములైతే ప్రజల సమస్యలు తెలుస్తాయని అన్నారు. పేదల కోసం కష్టపడుతున్నామని అన్నారు. చేప ఇవ్వడమే కాదు.. పట్టిచ్చే విధానం నేర్పుతాం అని అన్నారు. భర్త చనిపోతే ఆటోమేటిక్‌గా భార్యకు పింఛను ఇచ్చే వెసులుబాటును తీసుకొచ్చామన్నారు. మూడునెలల వరకు పింఛను తీసుకునే వెసులుబాటు కల్పించామని అన్నారు. భర్త చనిపోతే భార్య అనాథగా మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు వివరించారు.

## పవన్ కీలక నిర్ణయం.. నెలలో 15 రోజులు, రెండు పూటలా రేషన్ పంపిణీ..!



**అమరావతి,:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నెలలో 15 రోజులు, రెండు పూటలా రేషన్ సరకుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల చౌక ధరల దుకాణాలు గత ప్రభుత్వంలో మూసేసి, ఇంటింటికి అందిస్తాం అని రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేసిన విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. ఇంటింటికి ఇవ్వడం మానేసి నెలలో 1-2 రోజులు మాత్రమే జంక్షన్లలో వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతోమంది పేదలకు ఆ సరుకులు అందక ఇబ్బందులుపడ్డారని ఆరోపించారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని, చిరుద్యోగాలకి సెలవు పెట్టుకోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు.ఎమిగిలిన రేషన్ బియ్యం, సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపిందని వెల్లడించారు. వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖ పోర్టుల్లో పట్టుకున్నారని.. వీటిని అరికట్టేందుకు, ప్రతీ పేద కుటుంబానికి రేషన్ సరుకులు అందించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు.. ఉదయం 8 గం.ల నుంచి 12 గం.ల వరకు అలాగే సాయంత్రం 4గం. ల నుంచి 8 గం.ల వరకు రేషన్ డీలర్ల దుకాణాల వద్ద అందించనున్నట్లు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. దీని ద్వారా రద్దీని తగ్గించడమే కాకుండా, ప్రతీ ఒక్క కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుందని వెల్లడించారు. దివ్యాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, గోవుల సంరక్షణపై సీఎం రేవంత్ సమీక్ష..



**హైదరాబాద్, :** తెలంగాణ రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని సీఎం ఆదేశించారు. గో సంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలన్నారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని సూచించగా.. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని అన్నారు. కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయితే, ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు ఏర్పాటు చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్ ను ప్రభుత్వం ఖరారు చేయనుందని సీఎం తేల్చి చెప్పారు.

# ఆయుధాల పందేరం!



రాజ్యాంగాన్ని మనం అమలు చేసుకోవటం మొదలెట్టి 75 ఏళ్లవుతుండగా మన పాలకుల విపరీత పోకడలు దాన్ని కాస్తా భ్రష్టుపట్టించే దిశగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని సరిహద్దులకు సమీపంగా వుండే మారుమూల ప్రాంతాల్లోని స్థానిక తెగలకూ, నివాసితులకూ ఆయుధాల లైసెన్స్‌లుమంజూరు చేయాలని అస్సాం మంత్రివర్గం బుధవారం నిర్ణయించటం ఆ కోవలోనిదే. సరిహద్దు ఆవలి నుంచి చొరబడి బెదిరింపులకు దిగేవారి నుంచి రక్షణ కోసం, వ్యక్తిగత భద్రత కోసం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెబుతున్నారు. 'జాతి, నేల, స్థానికత' కాపాడటం కోసమే ఇలా చేస్తున్నామని ఆయన ప్రకటించారు. బంగ్లాదేశ్ పొడవునావుండే రెండు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల వాసులకు ఈ ఆయుధాల లైసెన్స్‌లు లభిస్తా యని ఆయన చెప్పారు. ఈ ప్రాంతాలన్నిటా ముస్లింల జనాభా ఎక్కువ. ఇప్పుడు జనం చేతికి తుపాకులందితే మత ఉద్రిక్తతలు పెరిగినప్పుడల్లా తుపాకులు మాట్లాడటం మొదలవుతుంది. ఇది ప్రభుత్వానికి మంచిదేనా? 1985 నుంచీ ఆ ప్రాంతాలవారు ఈ లైసెన్స్‌ల కోసం డిమాండ్ చేస్తుంటే గత ప్రభుత్వాలేవీ సాహసించలేదని, వాటికి ధైర్యంలేదని శర్మ వివరిస్తున్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకొనేది తమకు రక్షణ, భద్రత కల్పిస్తాయని, మౌలిక సదుపాయల కల్పనపై శ్రద్ధ పెడతాయని, తమ బతుకులు మెరుగుపరచటానికి అవసరమైన పథకాలు రూపొందిస్తాయని ఆశించబట్టే! ఇంతకూ 'ధైర్యం లేని' గత ప్రభుత్వాల్లో తాను మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలున్నట్టేనా? ఆ కాలాల్లోని ప్రభుత్వాలకు 'ధైర్యం' కలిగించేందుకు తాను చేసిందేమిటి? తాను విఫలమైన పక్షంలో దానిపై నిలదీయకుండా మౌనంగా ఎందుకు ఉండిపోయినట్టు? దాదాపు పాతికేళ్లుగా శర్మ రాజకీయాల్లో వుంటున్నారు. ఆయన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల్లో కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 2015లో కాంగ్రెస్ నుంచి తప్పుకోవటానికి కూడా కారణం ఆ సర్కార్‌కు ధైర్యం లేదని కాదు. తన రాజకీయ ఎదుగుదలకు అప్పటి సీఎం తరుణ్ గొగోయ్ అడ్డంకిగా మారటం! దీన్నంతటినీ రాహుల్‌గాంధీని కలిసి మొరపెట్టుకోవాలని శర్మతీవ్రంగా ప్రయత్నించారు.

కానీ జనాదరణగల యువ నాయకుల కన్నా పీఠాధిపత్యం నెరపే వృద్ధ తరం నేతలకే పెద్దపీట వేసే సంస్కృతిగల కాంగ్రెస్‌లో అది సాధ్యపడలేదు. నేపథ్యం ఏమైనా బీజేపీలో శర్మ బాగా రాణించారు. ఏనాటినుంచో ఆ పార్టీలో వున్న నేతలను తలదన్నే విధంగా ప్రకటనలిచ్చి వివాదాస్పదుడూ అయ్యారు. అందువల్ల పార్టీలో ఆయన పట్టు పెరిగింది గనుకే 2021లో బీజేపీ అధిష్ఠానం శర్మను అస్సాం ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. కానీ గత ప్రభుత్వాలు తుపాకీ లైసెన్స్‌లు ఇవ్వకపోవటానికి వాటికి ధైర్యం లేకపోబట్టే అని ఆయన దేని ఆధారంగా నిర్ణయానికొచ్చారో చెప్పలేదు. శర్మ చెబుతున్న ప్రకారం ఆ ప్రభుత్వాలు సాహసించలేక పోబట్టి చాలామంది స్థానిక తెగలవారు బయటి వ్యక్తుల ఒత్తిళ్లకు లొంగి భూములు అమ్ముకోవాల్సి వచ్చింది. అక్కణ్ణించి వలసలు పోవాల్సి వచ్చింది. మరి ప్రభుత్వాల వైఖరి వల్ల జనం ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ఆయన మౌనంగా మిగిలిపోవటం ఎందువల్ల? హిమంత గ్రహించాల్సిన విషయం ఒకటుంది. గతంలో ప్రజల నుంచి ఎన్ని డిమాండ్లు వచ్చినా అప్పటి ప్రభుత్వాలు ఆయుధ లైసెన్సులివ్వకపోవటానికి కారణం ధైర్యం లోపించి కాదు. అది అనైతికమూ, రాజ్యాంగ విరుద్ధమూ అని విశ్వసించటం వల్ల! అమెరికాలో పౌరులెవరైనా ఆయు ధాలు కొనుక్కోవచ్చు. అందుకు కొన్ని నిబంధనలున్నా ఆచరణలో అవి ఏమవుతున్నాయో అక్కడ తరచు జరిగే ఉదంతాలు గమనిస్తే అర్థమవుతుంది. అక్కడ సగటున 100 మంది పౌరులకూ 120.5 తుపాకులున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. నిరుడు తుపాకీ మరణాలు 30,000 మించాయి. అకారణంగా లేదా భయపడి తరచు అవతలివారిని చంపుతున్న ఉదంతాలు ఎక్కువ. ఆ దేశంలో కూడా హిమంత ప్రభుత్వం ఏకరువు పెడుతున్న నిబంధల వంటివే వున్నాయి. మానసికంగా సక్ర మంగా వుండి అవతలివారి నుంచి ప్రాణభయం ఉన్న 21 ఏళ్లు పైబడినవారందరికీ లైసెన్సులిస్తా మని హిమంత చెబుతున్నారు. ఏదైనా కేసులో శిక్షపడినా, శాంతికి దోహదపడతామని గతంలో ప్రభుత్వానికి బాండు రాసిచ్చినా అనర్హులవుతారట. అంతేగాక మానసికంగా, శారీరకంగా సరైన స్థితిలో వున్నవారికే లైసెన్సులు జారీచేస్తారట. ఒకసారంటూ కళ్లెం వదిలాక ఇవన్నీ నిజాయతీగా, చిత్తశుద్ధిగా అమలవుతాయా? అనుమానమే! అస్సాం మొదటినుంచీ సమస్యాత్మక రాష్ట్రం. అక్రమంగా చొరబడిన విదేశీయులను వెనక్కిపంపాలంటూ ఉవ్వెత్తున లేచిన విద్యార్థి ఉద్యమం, అటుతర్వాత ఉల్ఫా లాంటి ఉగ్రవాద సంస్థల ఆగడాలు తెలియంది కాదు. నిత్యం అపహరణలు, డబ్బు దండుకోవటం, హత్యలు ఒకప్పుడు చాలా అధికం. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) జవాన్లు, పోలీసులు ఉల్ఫా ఆటకట్టించాక అవి చాలావరకూ తగ్గిపోయాయి. ఇప్పటికీ బీఎస్ఎఫ్ జవాన్లు సరిహద్దుల్లో నిత్యం పహారా కాస్తుంటారు. సమస్య వుందనుకుంటే మరింతమందిని నియమించి, పటిష్ఠమైన పర్యవేక్షణ అమలు చేయటం పెద్ద కష్టం కాదు. అందుకు భిన్నంగా లైసెన్సులిస్తామంటే ప్రభుత్వం చేతులెత్తేసినట్టు కాదా? ఇలాంటి కారణాల వల్లే గతంలో ఛత్తీస్‌గఢ్‌లో సుప్రీంకోర్టు సల్వాజుడుంను రద్దుచేసింది. పైగా అస్సాంకు భారీయెత్తున పెట్టుబడులు తీసుకొస్తామని చెబుతూ శాంతికి విఘాతం కలిగించే ఇలాంటి విధానం అమలు చేయటం సరైందేనా? హిమంత ఆలోచించాలి.

# ఉష్ణోగ్రతల పెరుగుదలతో వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు

### ముంచుకొస్తున్న ముప్పు
### మరో 2 డిగ్రీలు పెరిగితేహిందూకుష్‌లో 75 శాతం మంచు మాయం
### ఆసియాలో 200 కోట్ల మంది మనుగడకు ప్రమాదం
### 10 దేశాల సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి
### గ్లేసియర్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలంటున్న పర్యావరణ నిపుణులు



న్యూఢిల్లీ: హిమాలయ పర్వతాలు భారతదేశానికి పెట్టని కోటలాంటివి. హిమాలయాల్లోని 800 కిలోమీటర్లకుపైగా పొడవైన హిందూకుష్ పర్వత శ్రేణిలో ఎన్నెన్నో హిమానీనదాలు(గ్లేసియర్స్) ఉన్నాయి. ఎన్నో నదులు, సరస్సులకు ఇవే ఆధారం. మధ్య, దక్షిణాసియాలో హిందూకుష్ గ్లేసియర్స్ నుంచి వచ్చే నీటిపై ఆధారపడి 200 కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతుండడంతో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. పారిశ్రామిక యుగానికి ముందున్న ఉష్ణోగ్రతల కంటే మరో 2 డిగ్రీల సెల్సియస్‌కుపైగా పెరిగితే ఈ శతాబ్దం ఆఖరు నాటికి హిందూకుష్ హిమానీనదాల మంచులో 75 శాతం అంతమైపోతుందని తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. 200 కోట్ల మంది జీవనం ప్రమాదంలో పడుతుందని తేలింది. ఈ అధ్యయనం వివరాలను సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. భూగోళంపై మానవ మనుగడ కొనసాగాలంటే వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ దేశాలన్నీ తక్షణమే దృష్టిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. 10 దేశాలకు చెందిన 21 మంది శాస్త్రవేత్తలు ఉమ్మడిగా ఈ అధ్యయనం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 2 లక్షలకుపైగా గ్లేసియర్లలో మంచు కరుగుతున్న తీరును పరిశీలించడానికి 8 గ్లేసియర్ మోడల్స్ ఉపయోగించారు. ఉష్ణోగ్రతలు మరింత పెరగకుండా స్థిరంగా ఉన్నప్పటికీ గ్లేసియర్లలో మంచు కరగడం ఇప్పట్లో ఆగదని అధ్యయనకర్తలు స్పష్టంచేశారు. రాబోయే కొన్ని దశాబ్దాలపాటు ఈ పరిమాణం కొనసాగు తూనే ఉంటుందని పేర్కొన్నారు. ఉష్ణోగ్రత కేవలం అర డిగ్రీ పెరిగినా సరే దాని ప్రభావం హిమానీనదాలపై కచ్చితంగా ఉంటుందని, ఈ మేరకు మంచు కరిగిపోతుందని సైంటిస్టు డాక్టర్ హ్యారీ జెకొల్లారీ చెప్పారు. మనం ఈ రోజు తీసుకొనే నిర్ణయాలు మన భవిష్యత్తు తరా ల బతుకులను నిర్ణయిస్తాయని అన్నారు. రాబోయే తరాలు బాగుండాలంటే గ్లేసియర్లను కాపాడుకోవాలని సూచించారు. పారిస్ వాతావరణ ఒప్పందం ప్రకారం.. భూమిపై ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేస్తే హిమాలయాలు, కాకస్ పర్వతాల్లో 40-45 శాతం మంచును కాపాడుకోవచ్చు. ఒకవేళ ఉష్ణోగ్రతలు 2.7 డిగ్రీలు పెరిగితే ప్రపంచవ్యాప్తంగా 75 శాతం మంచు కరిగిపోతుంది. ఈ శతాబ్దం ఆఖరు నాటికి కేవలం 25 శాతమే మిగిలి ఉంటుంది. యూరప్‌లో ఆల్ఫ్స్, ఉత్తర అమెరికాలో రాకీస్‌తోపాటు ఐస్‌ల్యాండ్‌లోని గ్లేసియర్లు మానవులకు జీవనాధారం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం వీటికి ముప్పు పొంచి ఉంది. భూగోళం మరో రెండు డిగ్రీలు వేడెక్కితే.. ఇక్కడ మంచు 10-15 శాతమే మిగులుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 90 శాతం మంచు కనుమరుగైతే పరిస్థితి తీవ్రత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇక స్కాండినేవియా ప్రాంతంలో మంచు పూర్తిగా కరిగిపోతుందన్న అంచనాలున్నాయి. హిమానీనదాలపై ఐక్యరాజ్యసమితి తొలి సదస్సు ప్రస్తుతం తజకిస్తాన్‌లోని దుషాన్బేలో జరుగుతోంది. 50కిపై దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరిగిపోతుండడం వల్ల ఆసియాలో 200 కోట్ల మందికి కష్టాలు రాబోతున్నాయని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు యింగ్‌మింగ్ యాంగ్ హెచ్చరించారు. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో సమీప భవిష్యత్తులో తీవ్రమైన వరదలు, కరువులు సంభవించే ప్రమాదం ఉందని, సముద్ర నీటి మట్టం పెరగడం వల్ల తీర ప్రాంతాలు మునిగిపోతాయని చెప్పారు. మంచు కరిగిపోవడాన్ని ఆపాలంటే శిలాజ ఇంధనాలను పక్కనపెట్టాలని, క్లీన్ ఎనర్జీని ఉపయోగించుకోవాలని యింగ్‌మింగ్ యాంగ్ స్పష్టంచేశారు. భూమిని అగ్నిగుండంగా మారుస్తున్న కాలుష్య ఉద్గారాలకు కళ్లెం వేయాలన్నారు.

# అవమానకరంగా వైదొలిగిన ఎలన్ మస్క్!



ఎలన్‌మస్క్, ప్రపంచ కుబేరుడు, అమెరికా అధినేత ట్రంప్ మానసపుత్రుడు, స్వల్పకాలమే అయినా అసాధారణ అధికారాలను వెలగబెట్టిన అత్యంత వివాదాస్పద వ్యక్తి. తన 130 రోజుల నియామక వ్యవధి కంటే రెండు రోజులు ముందుగా పదవి నుంచి తప్పుకున్నాడు. గడువుకంటే ముందా వెనుకా అన్నది కాదు తప్పుకున్న తీరే అత్యంత అవమానకరంగా జరిగిందన్నదే చర్చ. మితవాద భావజాల పరంగా ఇతరంగా ట్రంప్‌ను ఆకాశానికి ఎత్తటమే కాదు, రిపబ్లికన్ పార్టీ విజయానికి 30 కోట్ల డాలర్లకు పైగా నిధులు ఇచ్చిన మస్క్ రాజీనామా చేసే ముందు కనీసం ట్రంప్‌తో కూడా చెప్పలేదని వార్తలు. ఇది రాసిన సమయానికి అసలైన కారణాలు ఇంకా తెలియలేదు. ప్రభుత్వశాఖల్లో అసమర్థత, అనవసరపు ఖర్చును తగ్గించేందుకు ఏర్పాటు చేసిన శాఖ "డోజ్ " సలహాదారుగా మస్క్ తీసుకున్న చర్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. అంతా సజావుగా ఉంటే అదే పదవిలో లేదా మరొకదానిలో ఎలన్ మస్క్‌ను ట్రంప్ కొనసాగించి ఉండేవాడు. ప్రారంభం నుంచి దూకుడుతో వ్యవహరించి సాధించిందేమీ లేకపోగా ఉద్యోగులు, సాధారణ పౌరుల నుంచి తీవ్ర అసంతృప్తి, కొందరు మంత్రులు, ఉన్నతాధికారులతో దెబ్బలాటలు చివరికి ఈ తలనొప్పి ఏమిటిరా బాబూ అని రిపబికన్ పార్టీ నేతలు తలలు పట్టుకొనేంతగా రెచ్చిపోయాడంటే అతిశయోక్తి కాదు. పేనుకు పెత్తనమిస్తే ఏం జరుగుతుందో తెలిసినప్పటికీ ఇలాంటి వారికి అధికారమిస్తే ఏవిధంగా వ్యవహరిస్తారో ఒక్క అమెరికాకే కాదు, ప్రపంచ దేశాలన్నింటికీ ఒక గుణపాఠం నేర్పాడు. రెండులక్షల కోట్ల డాలర్లకు పైగా బడ్జెట్‌లోటును తగ్గిస్తామని ఎన్నికల్లో చెప్పిన ట్రంప్ ఐదు నెలలు కూడా గడవక ముందే 2.3లక్షల కోట్ల అదనపులోటుకు దారితీసే పన్నుల బిల్లును ప్రతిపాదించాడు. దాన్ని బహిరంగంగా తూర్పారపట్టిన మరుసటి రోజే ఎలన్ మస్క్ తాను బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. లేకపోతే ట్రంపే తొలగించి ఉండేవాడేమో ! పొదుపు పేరుతో అనేక సంక్షేమ పథకాలకు కోత ప్రకటించాడు. బెదిరించి, కొందరిని పొమ్మనకుండానే పొగబెట్టి, మరి కొంత మందికి పాకేజీలు ఇచ్చి ఇరవైమూడు లక్షల మంది ఫెడరల్ ఉద్యోగుల్లో 2.6లక్షల మందిని ఇంటికి పంపించాడు. 1930దశకంలో తలెత్తిన మహా ఆర్థిక సంక్షోభంలో సర్వం కోల్పోయిన జనం వీధుల్లో గుడారాలు వేసుకొని తలదాచుకున్నారు, వాటిని నాటి అధ్యక్షుడు హూవర్ పేరుతో వ్యంగ్యంగా పిలిచినట్లే, మస్క్ దెబ్బకు వీధులపాలనై వారు కూడా అదే మాదిరి నిరసన తెలుపుతూ వేసిన గుడారాలకు మస్క్ పేరు పెట్టారు. ట్రంప్-మస్క్ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ నెలలో లక్షలాది మంది కార్మికులు దేశమంతటా ప్రదర్శనలు జరిపారు. మస్క్ టెస్లా కంపెనీ కార్యాలయాలు, ఫ్యాక్టరీల ముందు నిరసన ప్రదర్శనలు చేశారు. వ్రతం చెడ్డా ఫలం దక్కిందా అంటే కేవలం 17,500 కోట్లు మాత్రమే తగ్గించగలిగినట్లు వార్తలు. తాను పొదుపు చేస్తుంటే అధ్యక్షుడు ట్రంప్ 2.3లక్షల కోట్ల డాలర్ల లోటును పెంచే పన్నుల బిల్లును తెచ్చినట్లు ఒక టీవీలో బహిరంగంగా మస్క్ తూర్పారబట్టాడు. నిజానికి మస్క్ గత కొద్ది వారాలుగా వ్యవహరించిన తీరు, పెట్టిన ఎక్స్ పోస్టులు, మీడియాలో స్పందనలను చూస్తే పదవిలో నిలిచేరకం కాదని అనేక మంది భావించారు. ఊరంతా కావమ్మ మొగుడు అంటే నేను కూడా కామోసు కామోసు అనుకొని కాపురం చేశాను, ఇప్పుడు కాదంటున్నారు గనుక నా కర్రా బుర్రా ఇస్తే నా దారిన నేపోతా అన్న ఒక సన్యాసి కథ తెలిసిందే. ఎలన్ మస్క్‌ను కూడా అమెరికా ఆర్థిక ఇబ్బందులను పొదుపు, సామర్థ్యంతో గట్టెక్కించే దూత అని భావించారు.

అయితే ఎలన్ మస్క్ సన్యాసి కాదు గనుక తన టెస్లా, స్టార్‌లింక్, స్పేస్‌ఎక్స్ వంటి కంపెనీలను చూసుకుంటా రోజంతా అక్కడే ఉంటా అవసరమైతే రాత్రుళ్లు కూడా అక్కడే పడుకుంటానంటూ ముందుగానే వెల్లడించాడు. మస్క్ చివరికి తన గాంగ్ నుంచి ఇలా నిష్క్రమిస్తాడని ట్రంప్ కూడా ఊహించి ఉండడు. ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకొనే వస్తువుల మీద ప్రతికూల పన్నులు వేసి జనాల జేబులను గుల్లచేసే ట్రంప్ విధానాలకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నది. ప్రకటించిన పన్నులను అమలు చేస్తే జనంలో వ్యతిరేకత, తోకముడిస్తే ప్రపంచంలో చులకన. డోనాల్డ్ ట్రంప్ ఇరకాటంగా ఇది కనిపించినప్పటికీ అమెరికా పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న సంక్షోభంలో ఒక అంశంగా మస్క్ ఉదంతాన్ని చూడవచ్చు.

శుభోదయం

## సంపాదకీయం

# విద్యార్థుల వీసాల విలాపం

## (విశ్లేషణ)

అగ్రరాజ్యం అమెరికాలో విదేశీ, ముఖ్యంగా భారతీయ విద్యార్థుల భవిష్యత్ అయోమయంలో పడింది. వీసా రద్దు చేయడం, ఒపిటిపై ఆంక్షలు విధించడం, ఫెడరల్ నిధుల కోతలు వంటివి ఆందోళనకు దారితీస్తున్నాయి. తాజాగా విద్యార్థుల వీసాల ఇంటర్వ్యూలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో అమెరికా వ్యతిరేక, హమాస్ అనుకూల భావజాలం పెరిగిపోతోందని, చైనా కమ్యూనిస్టు పార్టీతో కొంతమంది విద్యార్థులకు సంబంధాలు ఉంటున్నాయని ఇలా అనేక ఆరోపణలపై అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాలను అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అయితే ఈ పరిశీలనకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసే వరకు వీసాల బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అమెరికా అధికార యంత్రాంగం ప్రకటించింది. వీసాకు దరఖాస్తు ఫారమైన డిఎస్ **160** ద్వారా **201112** నుంచే సోషల్ మీడియా ఖాతాలను అడుగుతున్నారు. అయితే దరఖాస్తుదారుల ఖాతాలన్నిటినీ వేగంగా తనిఖీ చేసే విధానం ఇంకా లేకపోవడంతో ఎప్పుడు వీసాల ఇంటర్వ్యూలు ఉంటాయో తెలియడం లేదు.అమెరికా యూనివర్శిటీలు ఆగస్టు డిసెంబర్, జనవరి మే సెమిస్టర్లకు రెండుసార్లు ప్రవేశాలు కల్పిస్తాయి. సాధారణంగా భారతీయ విద్యార్థులు ఆగస్టు డిసెంబర్ సెమిస్టర్‌నే ఎంపిక చేసుకుంటారు. దీంతో ఆరునెలల ముందునుంచే వీసా కోసం ప్రయత్నిస్తుంటారు. విద్యార్థులకు ఇచ్చే ఎఫ్**1**వీసాను నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా అంటారు. అమెరికాలో పూర్తికాలం విద్యకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది. **2023** లో **1.03** లక్షల మంది భారతీయ విద్యార్థులకు వీసాలు (%ఎఱయిుం ెబఎవత్ం%) అందగా, **202324** లో ఎఫ్**1** వీసాలను భారీగా తగ్గించారు. **2024**లో మొదటి **9** నెలల్లోనే భారతీయ విద్యార్థులు **38%** మందికి అమెరికా వీసాలు తిరస్కరించింది. ఈ ఏడాది తొలి సెమిస్టర్ కోసం దాదాపు **78** వేల మంది వీసా కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు **24** వేల మందికి ఇంటర్వ్యూ తేదీలు వచ్చాయి. కొందరికి ఇంటర్వ్యూలు జరిగాయి.ఇందులో **6** వేలమంది వివిధ కారణాలవల్ల తిరస్కరణకు గురయ్యారు. ఇక **54** వేల మంది ఇంటర్వ్యూ తేదీ కోసం ఎదురు చూస్తున్నారు. అమెరికా అనుసరించే సోషల్ మీడియా వెట్టింగ్ విధానం విదేశీ విద్యార్థుల వీసా ప్రక్రియపై పెను ప్రభావం చూపనుంది. అంతేకాదు అమెరికా యూనివర్శిటీలపై ఆర్థిక భారం కూడా పడుతుంది. భారత్ నుంచి ఏటా **7** లక్షల మంది విదేశీ విద్యకు వెళ్తున్నారు. ఇందులో **3** లక్షల మంది అమెరికాకే వెళ్తున్నారు. మన విద్యార్థులు చదువుకోసం ప్రతి ఏటా రూ. లక్ష కోట్లు చెల్లిస్తున్నారని భారత విదేశీ మంత్రిత్వశాఖ తెలియజేసింది. ఏటా భారత్ నుంచి వెళ్లే విద్యార్థుల్లో **40** వేల నుంచి **50** వేల మంది తెలుగువారే ఉండేవారు. అయితే అక్రమ వలసదారులను పట్టుకుని తిరిగి పంపించడం ప్రారంభించాక పార్ట్‌టైమ్ చేస్తున్న భారత విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. ఏటా వెళ్లే వారిలో **50%** అమెరికా చదువులను వాయిదా వేసుకోవలసి వచ్చింది. గత ఏడాది **2.7** లక్షలకు పైగా భారత విద్యార్థులు అమెరికాలో నమోదయ్యారు.దీనివల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు **43.8** బిలియన్ డాలర్ల (రూ. **3,73,982** కోట్లు) ఆదాయం సమకూరింది. **202324**లో **10** లక్షలకు పైబడిన విదేశీ విద్యార్థుల వల్ల అమెరికాకు దాదాపు **4400** కోట్ల డాలర్ల సంపద సొంతమైంది. **3.78** లక్షల ఉద్యోగాల కల్పన సాధ్యమైంది. అమెరికా వర్శిటీల్లో చదువుకున్న విదేశీయుల్లో చాలా మంది అక్కడే స్టార్టప్‌లు, ఇతర వ్యాపారాలు నెలకొల్పుతూ స్థానిక ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. అమెరికాలో చదువుకున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతీయులు మొదటి స్థానంలోను, చైనీయులు రెండో స్థానంలోను ఉన్నారు. **2023 24** సంవత్సరంలో చైనా నుంచి **2** లక్షల **70** వేలమంది విద్యార్థులు అమెరికా చదువులకు వెళ్లారు. అమెరికాలో ఉన్న విదేశీ విద్యార్థుల్లో నాలుగోవంతు చైనీయులే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేయడంపై చైనా స్పందించింది. అంతర్జాతీయ విద్యార్థులతో సహా చైనా విద్యార్థుల చట్టబద్ధమైన హక్కులు, వారి ప్రయోజనాలను కాపాడాలని అమెరికాను కోరింది. ఇరుదేశాల మధ్య విద్యాపరమైన విషయాల్లో ఎలాంటి అడ్డంకులు రాకుండా చూసుకోవాలని సూచించింది. అంతర్జాతీయ విద్యార్థుల అడ్మిషన్ల పైన, వారి ట్యూషన్ ఫీజుల పైన ఆధారపడిన అమెరికా విశ్వవిద్యాలయాలకు ట్రంప్ సర్కారు విధానాల వల్ల ఆర్థిక కష్టాలు మరింత ఎక్కువ కానున్నాయి. ఇటీవలే హార్వర్డ్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలపై ట్రంప్ సర్కారు నిషేధం విధించడం లక్షలాది మంది విద్యార్థుల కలలను చెరిపివేస్తోంది. ఇంతేకాకుండా క్లాసులకు గైర్హాజరైతే వీసాలు రద్దంటూ మరో కఠోర నిర్ణయాన్ని తెరపైకి తీసుకువచ్చారు. ఈ పరిణామాలన్నిటి నేపథ్యంలో అమెరికాలో సగటు భారతీయ విద్యార్థి పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్న ఎదురవుతోంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారతదేశంలో విద్యార్థులు చదువులకోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉందా? అమెరికా అధ్యక్షుడి సలహా సంఘం మాజీ సభ్యుడైన అజయ్ భుటోరియా తాజా పరిణామాలపై స్పందిస్తూ కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల ఇంటర్వ్యూలను అమెరికా నిలిపివేయడం ముఖ్యంగా భారతీయ విద్యార్థులకు ఆందోళన కలిగించే అంశమని వ్యాఖ్యానించారు. ఎంతో మంది భారతీయ విద్యార్థుల చదువుల కలలను భగ్నం చేస్తుందన్నారు.

# భారత్, రష్యా-చైనా QUAD కి ప్రతిగా మారుతాయా? రష్యా మంత్రి సంచలన వ్యాఖ్యలు!



మారుతున్న ప్రపంచ దౌత్య చిత్రంలో, భారతదేశం, రష్యా, చైనా అనే త్రయం మరోసారి వార్తల్లో నిలిచింది. ఈసారి రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ స్వయంగా ఈ సూచనలు చేశారు. సరిహద్దు ఉద్రిక్తతకు సంబంధించి భారత్-చైనా మధ్య ఒక అవగాహన కుదిరిందని, ఇప్పుడు రష్యా-భారత్-చైనా త్రైపాక్షిక వేదికను తిరిగి ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ వేదిక అమెరికా ప్రభావాన్ని సమతుల్యం చేయడానికి, ఆసియా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఒక దృఢమైన మాధ్యమంగా మారగలదు. అమెరికా నేతృత్వంలోని క్వాడ్ గ్రూప్ ఆసియాలో సైనిక కార్యకలాపాలను వేగంగా పెంచుతున్న సమయంలో లావ్రోవ్ సంచలన ప్రకటన చేశారు. ఇతర దేశాలు దీనిని సైనిక కూటమిగా మార్చాలని కోరుకుంటుండగా, భారతదేశం వాణిజ్యం, శాంతియుత సహకారం ఉద్దేశ్యంతో మాత్రమే ఈ వేదికతో అనుసంధానించాలని రష్యా విశ్వసిస్తుంది. భారతదేశంతో జరిగిన చర్చలలో, క్వాడ్‌లో భారత్ ప్రమేయం వాణిజ్యం, శాంతియుత ఆర్థిక అభివృద్ధి గురించి మాత్రమే అని రష్యాకు స్పష్టమైందని రష్యా మంత్రి లావ్‌రోవ్ అన్నారు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా వంటి ఇతర క్వాడ్ సభ్య దేశాలు క్రమంగా దానిని సైనిక కూటమిగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. ఈ దేశాలు ఉమ్మడి నావికా విన్యాసాలు, భద్రతా సహకారం వంటి దశల ద్వారా పరిస్థితిని సైనిక దిశలో మార్చాలని కోరుకుంటున్నాయన్నారు. రష్యా-చైనా మధ్య నమ్మకం, సహకారం ఆధారంగా లోతైన సంబంధాలు ఉన్నాయని లావ్రోవ్ అన్నారు. రెండు దేశాలు బహుళ ధ్రువ ప్రపంచానికి మద్దతుదారులు, ఇక్కడ ఏ ఒక్క దేశానికీ ఆధిపత్యం లేదు. సెప్టెంబర్‌లో చైనాలో జరిగే 80వ విజయోత్సవ వేడుకలకు పుతిన్ హాజరవుతారని ఆయన స్పష్టం చేశారు. మరింత న్యాయమైన, స్థిరమైన కొత్త ప్రపంచ క్రమాన్ని నిర్మించడానికి రష్యా-చైనా కలిసి పనిచేస్తున్నాయని లావ్రోవ్ అన్నారు. రెండు దేశాలు ఐక్యరాజ్యసమితి చార్టర్ సూత్రాలను పూర్తిగా అమలు చేయాలని సమర్థిస్తాయి. ఉగ్రవాదం, నాజీయిజం, ఏకపక్ష ఆంక్షలు వంటి ఆధునిక నవ-వలసవాద వ్యూహాలను వ్యతిరేకిస్తాయి. భద్రత అనే భావన అందరికీ ఒకేలా ఉండే వ్యవస్థను సృష్టించడం వారి లక్ష్యమని రష్యా మంత్రి లావ్‌రోవ్ స్పష్టం చేశారు. RIC ఫోరం మళ్లీ క్రియాశీలకంగా మారితే, అది అమెరికా నేతృత్వంలోని కూటముల ప్రభావాన్ని సమతుల్యం చేయడమే కాకుండా ఆసియాలో వాణిజ్యం, భద్రత, దౌత్యానికి కొత్త మార్గాలను తెరుస్తుందని రష్యా మంత్రి లావ్‌రోవ్ అన్నారు. భారతదేశం విషయానికొస్తే, ఇది సమతుల్య వ్యూహంలో భాగం కావచ్చు. ఇక్కడ అది పశ్చిమ-తూర్పు దేశాలతో తన ప్రయోజనాలను కొనసాగించగలదు. లావ్రోవ్ చేసిన ఈ ప్రకటన అంతర్జాతీయ వర్గాలలో అమెరికా దౌత్యపరమైన అంచు ఇప్పుడు కఠినమైన సవాలును ఎదుర్కోబోతోందా అనే కొత్త చర్చకు దారితీసింది.

# ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు.. శత్రువు ఎక్కడున్నా వదిలేదీ లేదు: మోదీ



ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశం ఎక్కడికైనా దూసుకువెళ్తుందని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కాన్పూర్‌లో జరిగిన సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, ఈ అభివృద్ధి కార్యక్రమం ఏప్రిల్ 24న కాన్పూర్‌లో జరగాల్సి ఉండగా, పహల్గామ్ దాడి కారణంగా కాన్పూర్ పర్యటన రద్దు చేయాల్సి వచ్చిందని ప్రధాని అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో కాన్పూర్ బిడ్డ శుభం ద్వివేది కూడా ఉగ్రవాదుల క్రూరత్వానికి బలైయ్యాడు. కూతురు ఐష్ణయ బాధను మనమందరం పంచుకోవాలి. ఆపరేషన్ సింధూర్ రూపంలో మన కుమార్తెలు, సోదరీమణుల కోపాన్ని ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ అన్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల రహస్య స్థావరాలలోకి చొచ్చుకువెళ్లి, వారిని నాశనం చేశామని ప్రధాని మోదీ అన్నారు. మన సైన్యం ఎంత పరాక్రమం ప్రదర్శించిందంటే, పాకిస్తాన్ సైన్యం యుద్ధాన్ని ఆపమని వేడుకోవలసి వచ్చిందన్నారు. ఈ స్వాతంత్ర్య పోరాట భూమి నుండి, భారత సైన్యం ధైర్యసాహసాలకు పదే పదే సెల్యూట్ చేస్తున్నానని ప్రధాని మోదీ అన్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో వేడుకున్న శత్రువు ఎలాంటి భ్రమలో ఉండకూడదని పునరుద్ఘాటించారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశం మూడు సూత్రాలను నిర్దేశించుకుందని ప్రధాని మోదీ తెలిపారు. ముందుగా- ప్రతి ఉగ్రవాద దాడికి భారతదేశం తగిన సమాధానం ఇస్తుంది. దాని సమయం, పద్ధతి, పరిస్థితులను మన త్రివిధ దళాలు నిర్ణయిస్తాయి. రెండవది, భారతదేశం ఇకపై అణు బాంబు బెదిరింపులకు భయపడదు. దాని ఆధారంగా ఎవరూ ఎటువంటి నిర్ణయం తీసుకోరు. మూడవది, భారతదేశం ఉగ్రవాదానికి అధిపతిని, ఉగ్రవాదాన్ని పోషించే ప్రభుత్వాన్ని ఒకే దృష్టితో చూస్తుంది. పాకిస్తాన్ రాజ్య, రాజ్యేతర శక్తుల ఆటలు ఇక పనిచేయవు. సరళంగా చెప్పాలంటే కాన్పురియాలో, శత్రువు ఎక్కడికైనా భయపడి తరిమివేసతామని ప్రధాని మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో, భారతదేశ స్వదేశీ ఆయుధాల బలాన్ని, మేక్ ఇన్ ఇండియా సత్తాను ప్రపంచం చూసిందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. మన భారత ఆయుధాలు, బ్రహ్మోస్ క్షిపణి శత్రువుల భూభాగంలోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించాయి. లక్ష్యాలను నిర్ణయించిన చోట పేలుళ్లు జరిగాయి. స్వావలంబన భారతదేశం అనే సంకల్పం నుండి మనకు ఈ బలం లభించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రక్షణ రంగంలో స్వావలంబనలో పెద్ద పాత్ర పోషిస్తుండటం మొత్తం రాష్ట్రానికే గర్వకారణమని ప్రధానమంత్రి అన్నారు. కాన్పూర్‌లో ఒక పాత ఆయుధ కర్మాగారం ఉన్నట్లుగానే, అటువంటి 7 ఆయుధ కర్మాగారాలను పెద్ద ఆధునిక కంపెనీలుగా మార్చామన్నారు. నేడు దేశంలోనే అతిపెద్ద రక్షణ కారిడార్ ఉత్తరప్రదేశ్‌లో నిర్మిస్తున్నారు. ఒకప్పుడు అక్కడి నుండి పరిశ్రమలు వలస వస్తున్న సమయంలో, ఇప్పుడు రక్షణ రంగానికి చెందిన పెద్ద కంపెనీలు అక్కడికి వస్తున్నాయని ప్రధాని వెల్లడించారు. పెద్ద మెట్రో నగరాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు, అన్ని వనరులు ఇప్పుడు మన కాన్పూర్‌లో కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. సరైన ఉద్దేశాలు, దృఢ సంకల్పం, మంచి ఉద్దేశాలు కలిగిన ప్రభుత్వం ఉంటే దేశం, రాష్ట్ర అభివృద్ధికి ఎంత నిజాయితీగా కృషి చేయవచ్చో కాన్పూర్ మెట్రో ఒక నిదర్శనమన్నారు.ప్రధానమంత్రి మోదీ తన పర్యటన సందర్భంగా కాన్పూర్‌కు పెద్ద బహుమతిని ఇచ్చారు. 47 వేల 600 కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. కాన్పూర్ మెట్రో రైలు ప్రాజెక్టులోని చున్నిగంజ్ నుండి కాన్పూర్ సెంట్రల్ వరకు కొత్త భూగర్భ విభాగాన్ని ప్రారంభించారు. ఈ విభాగంలో 5 కొత్త భూగర్భ స్టేషన్లు (చున్నిగంజ్, బడా చౌరహా, నవీన్ మార్కెట్, నయగంజ్, కాన్పూర్ సెంట్రల్) ఉన్నాయి. కాన్పూర్ మెట్రో విస్తరణతో, లాల్ ఇమ్లి, జెడ్ స్క్వేర్ మాల్, గ్రీన్ పార్క్ స్టేడియం, పరేడ్ గ్రౌండ్, బుక్ మార్కెట్, సోమ్‌దత్ ప్లాజా వంటి ముఖ్యమైన ప్రదేశాలు నేరుగా మెట్రోకు అనుసంధానించడం జరుగుతుంది. ప్రస్తుతం, ఐఐటీ కాన్పూర్ నుండి మోతీజీల్ వరకు 9 స్టేషన్లు పనిచేస్తున్నాయి. ఇక అలాగే, ఘటంపూర్‌లో 660 మెగావాట్ల విద్యుత్ యూనిట్‌ను, పాంకిలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును కూడా ప్రధాని ప్రారంభించారు.

# ట్రంప్ సర్కార్ తీసుకుంటున్న చర్యలతో.. అమెరికా ఆదాయానికి భారీగా కోత!



విదేశీ విద్యార్థులకు వీసాలంటేనే చిర్రెత్తిపోతున్నారు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్. రోజుకో రీతిలో ఆ వీసాలకు ఎసరు పెట్టేందుకు ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే అనేక మార్గాల్లో విదేశీ విద్యార్థుల సంఖ్యకు కోత పెట్టేందుకు చర్యలు చేపట్టిన ట్రంప్.. ఇప్పుడు వర్సిటీల్లో 15 శాతం పరిమితిని విధిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు సోషల్‌మీడియాలో క్లీన్‌చిట్ ఉంటేనే అమెరికాకు ఎంట్రీ ఉంటుందని ఇప్పటికే ప్రకటించింది అమెరికా ప్రభుత్వం.ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే వీసా కట్..క్లాస్‌లకు బంక్ కొడితే వీసా కట్.. సోషల్ మీడియాలో వ్యతిరేకంగా పోస్ట్ పెడితే వీసా కట్.. ఇలా అమెరికాలో విదేశీ విద్యార్థులను తగ్గించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు అధ్యక్షుడు ట్రంప్. ఇతర దేశాల నుంచి చదువు కోసం వస్తున్న విద్యార్థులు అమెరికాలో సమస్యలు సృష్టిస్తున్నారన్న ట్రంప్.. హార్వర్డ్ యూనివర్సిటీతో పాటు ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో విదేశీ విద్యార్థులపై 15 శాతం పరిమితి విధిస్తామని స్పష్టం చేశారు. విదేశీ విద్యార్థులు కారణంగా స్థానిక అమెరికన్ విద్యార్థులు మెరుగైన విద్యను పొందలేకపోతున్నారని మండిపడ్డారు. దేశ వ్యతిరేక భావజాలానికి కొన్ని వర్సిటీలు కేంద్రంగా మారుతున్నాయని ఆరోపించారు. అందుకోసమే విద్యార్థుల వీసాలపై పరిమితి విధిస్తామని స్పష్టం చేశారు. అమెరికాలోని కొన్ని యూనివర్సిటీల ఆవరణల్లో ఇటీవల పాలస్తీనాకు మద్దతుగా పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని ట్రంప్ సర్కారు విదేశీ విద్యార్థులపై ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలోనే పలు కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది.అమెరికాలో ప్రస్తుతం 11 లక్షలకు పైగా విదేశీ విద్యార్థులు ఉన్నారు. వీరిలో 3 లక్షల మంది భారతీయ విద్యార్థులే. ట్రంప్ తీసుకుంటున్న వరుస నిర్ణయాలతో ఇప్పటికే అక్కడ ఉన్న విద్యార్థులతో పాటు అమెరికాలో చదవాలని ప్రణాళికలు వేసుకుంటున్న విద్యార్థులకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి. అమెరికాలో చదువు కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను ఇప్పటికే తాత్కాలికంగా నిలిపివేసింది అమెరికా ప్రభుత్వం. దాంతో పాటు సోషల్ మీడియా వెట్టింగ్‌ను తెరపైకి తెచ్చింది. అమెరికాలో చదువుకోవడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను క్షుణంగా పరిశీలిస్తారు. ఆ తర్వాతే వారికి వీసా మంజూరు చేస్తారు. అప్పటివరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు. ఉగ్రవాదులను నియంత్రించడం, యూదు వ్యతిరేకతను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ తనిఖీ చేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది.తాజా మరో ఉత్తర్వులు జారీ చేసింది ట్రంప్ సర్కార్. హార్వర్డ్ యూనివర్సిటీకి ఏ ప్రయోజనం కోసం వెళ్లాలనుకునే వీసా దరఖాస్తుదారుల అదనపు పరిశీలనను ప్రారంభించాలని అమెరికా విదేశాంగ శాఖ విదేశాల్లోని తన అన్ని కాన్సులర్ మిషన్లను ఆదేశించింది. దరఖాస్తుదారులలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, గెస్ట్ స్పీకర్లు, పర్యాటకులు కూడా ఉన్నారు. కానీ వారికి మాత్రమే పరిమితం కాదని తెలుస్తోంది. 'సోషల్ మీడియా వెట్టింగ్' విదేశీ విద్యార్థుల వీసా ప్రక్రియపై పెను ప్రభావం చూపనుంది. దీంతో అమెరికా యూనివర్సిటీలపై ఆర్థికంగానూ భారం పడనుంది. 2024లో 2.7 లక్షలకు పైగా నమోదైన భారత విద్యార్థులతో అమెరికా ఆర్థిక వ్యవస్థకు 43.8 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ ఆదాయానికి భారీగా కోతపడుతుందని వర్సిటీలు ఆందోళన చెందుతున్నాయి.మరోవైపు ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీకి అందించే నిధుల్లో ట్రంప్ ప్రభుత్వం కోత విధించింది. ఆ తర్వాత ఏకంగా విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ట్రంప్ చర్య అనైతికమని నిబంధనలు ఉల్లంఘించడం అవుతుందని హార్వర్డ్ పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి.. ట్రంప్ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## ఆపరేషన్ సిందూర్ తర్వాత "ఆశావాద సూచిక"లో భారత్ 4వ ర్యాంక్..




**న్యూఢిల్లీ,:** జాతీయ ఆశావాదంలో భారతదేశం ప్రపంచంలోనే టాప్ ప్లేస్‌లో ఉంది. ఆపరేషన్ సిందూర్ తర్వార భారతీయల్లో ఆశావాద దృక్పథం పెరిగిందని ఇప్సోస్ "వాట్ వర్రీస్ ది వరల్డ్" సర్వే చెప్పింది. మే 2025 ఎడిషన్‌లో భారత్ మూడు శాతం పాయింట్లు ఎగబాకి జాతీయ ఆశావాదంలో గణనీయమైన పెరుగుదల నివేదించినట్లు చెప్పింది. ప్రపంచంలోనే సింగపూర్, మలేషియా, ఇండోనేషియా తర్వాత "గ్లోబల్ ఆప్టిమిజం ఇండెక్స్"లో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్నట్లు సర్వే వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ జాతీయ సెంటిమెంట్ తో పెరుగుదల వచ్చినట్లు వెల్లడించింది. సర్వే ప్రకారం, భారతీయుల్లో 65 శాతం మంది దేశం సరైన దిశలో వెళ్తుందని నమ్ముతున్నారు. మునుపటి సర్వేలో ఇది 62 శాతం ఉంది. అయితే, దీనికి విరుద్ధం ప్రపంచ సగటు కేవలం 37 శాతం మాత్రమే ఉంది. ముఖ్యంగా, అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల్లో నిరాశావాదం చాలా బలంగా కనిపించింది. ఫ్రాన్స్, దక్షిణ కొరియా, పెరూ దేశాలు చివరి స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో ఆశావాదం పెరగడానికి మే 7న ఉగ్రవాదులే టార్గెట్‌గా పాకిస్తాన్‌పై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ కారణమని చెప్పారు. దాదాపుగా 25 నిమిషాల్లో భారత సైన్యం 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. 100కు పైగా ఉగ్రవాదుల్ని హతమార్చింది. దీని తర్వాత, పాక్ చేసిన మిస్సైల్, డ్రోన్ అటాక్స్‌ని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఈ దాడులకు ప్రతీకారంగా పాకిస్తాన్ వ్యాప్తంగా ఉన్న వైమానిక స్థావరాలపై భారత్ అత్యంత ఖచ్చితత్వంతో దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 11 ఎయిర్‌బేసులు ధ్వంసమయ్యాయి. కీలక వ్యవస్థల్ని పాకిస్తాన్ కోల్పోయింది. ఇదిలా ఉంటే, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారతీయులు ఉగ్రవాదాన్ని ప్రమాదకర సమస్యగా భావించే శాతం 26గా ఉంది. ఇది అక్టోబర్ 2019లో తర్వాత నమోదైన అత్యధిక స్థాయి. ద్రవ్యోల్బనం(37 శాతం), నిరుద్యోగం(33) శాతం తర్వాత టెర్రరిజం సమస్యగా ఉందని ఇప్సోస్ సర్వేలో తేలింది. నేరాలు-హింస(25 శాతం), రాజకీయ-ఆర్థిక అవినీతి(21 శాతం)గా ఉంది. గ్లోబల్ సౌత్‌లోని దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయని ఇప్సోస్ ఆశావాద సూచిక చూపిస్తుంది. సింగపూర్ 77 శాతంతో ముందంజలో ఉంది, తరువాత మలేషియా (69 శాతం), ఇండోనేషియా (67 శాతం), మరియు భారతదేశం (65 శాతం) ఉన్నాయి. అర్జెంటీనా (56 శాతం), థాయిలాండ్ (45 శాతం), మెక్సికో (45 శాతం) మొదటి ఏడు స్థానాల్లో ఉన్నాయి. దీనికి విరుద్ధంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ప్రజల్లో అసంతృప్తి తీవ్రంగా ఉన్నట్లు చెప్పారు. ఫ్రాన్స్ 19 శాతం మాత్రమే తమ దేశం సరైన మార్గంలో వెళ్తుందని అక్కడి ప్రజలు భావిస్తున్నారు. దక్షిణ కొరియాలో 15 శాతం, పెరూలో 9 శాతం ప్రజలు ఆశావాదంతో ఉన్నారని చెప్పింది.

## జూన్ 10న భారత్ బంద్‌కు పిలుపు.. మావోయిస్టు కేంద్ర కమిటీ లేఖ..



**న్యూఢిల్లీ,:** వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యమని కేంద్రం పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది. ఇది గతేడాది నుంచి ఆపరేషన్ ఊపందుకుంది. మావోయిస్టు కీలక నేతలను భద్రతా దళాలు మట్టుబెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టుల నుంచి ఓ లేఖ బయటకు వచ్చింది. ఆ లేఖలో మావోయిస్టు కేంద్ర కమిటీ జూన్ 10న భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు రాసుకొచ్చారు.. మావోయిస్టు కేంద్ర కమిటీ అభయ పేరుతో లేఖ విడుదల చేశారు. ఛత్తీస్‌ఘడ్‌లోని అబూజ్‌మడ్ అడవులు ఇన్నాళ్లు మావోయిస్టులకు కీలక స్థావరాలుగా ఉన్నాయి. కానీ అక్కడికి కూడా భద్రతా బలగాలు చొచ్చుకెళ్తున్నాయి. దట్టమైన అడవుల్లో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ.. భద్రతా బలగాలు ముందుకెళ్తున్నాయి. ఫలితంగా తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో మావోయిస్టులు చనిపోతున్నారు. జవాన్లూ వీరమరణం పొందుతున్నారు. కాగా.. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మే 21న మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ.1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు.

## భారతదేశ చరిత్రలోనే "సిందూర్" విజయవంతమైన యాంటీ-టెర్రర్ ఆపరేషన్..



**న్యూఢిల్లీ,:** పాకిస్తాన్ లోని ఉగ్రవాదులు భారతదేశ "నారీ శక్తి"ని తక్కువగా అంచనా వేసి తమ వినాశనాన్ని కొనితెచ్చుకున్నారని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిలో మహిళల ముందే భర్తల్ని ఉగ్రవాదులు చంపారు. ఈ సంఘటనలో లష్కరే తోయిబా ఉగ్రవాదులు 26 మందిని బలి తీసుకున్నారు. ఉగ్రవాదంపై భారతదేశ చరిత్రలోనే ఆపరేషన్ సిందూర్ అతిపెద్ద విజయవంతమైన చర్యగా ప్రధాని ప్రకటించారు. "పహల్గామ్‌లో, ఉగ్రవాదులు కేవలం రక్తం చిందించలేదు, వారు మన సంస్కృతిపై దాడి చేశారు. వారు మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు భారతదేశ నారీ శక్తిని సవాలు చేశారు. ఈ సవాలు ఉగ్రవాదులకు, వారి స్పాన్సర్లకు శాపంగా మారింది" అని రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా భోపాల్‌లో జరిగిన 'మహిళా సశక్తికరణ్ మహా సమ్మేళనం'లో పాల్గొన్న ప్రధాని మోదీ అన్నారు. భారత సైన్యం ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసి పాకిస్తాన్‌ని ఆశ్చర్యపరిచిందని ప్రధాని మోడీ అన్నారు. పాకిస్తాన్‌లోకి వందల కి.మీ చొచ్చుకెళ్లి మరీ వారి శిబిరాలను నాశనం చేశామని చెప్పారు. భారత్‌పై మళ్లీ ఉగ్రదాడి జరిగితే పాకిస్తాన్, దాని ఉగ్రవాదులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాదుల్ని వారి ఇళ్లలోకి దూరి మరీ చంపేస్తామని చెప్పారు.

## దూకుడు పెంచిన కవిత.. తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ఓపెనింగ్..



**హైదరాబాద్,** :ఇటీవల ఎమ్ఎల్సీ కవిత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు రాసిన లేఖ బహిర్గతం అయినప్పటి నుంచి రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో రాజకీయ వ్యవహారం హీటెక్కుతోంది. ఈ నేపథ్యంలో కవిత మరో సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ఓపెనింగ్ కు రెడీ అయ్యింది. ఇందిరా పార్క్ వద్ద పనిచేస్తున్న తెలంగాణ జాగృతి కార్యాలయం మూసివేయనున్నారు. సాయంత్రం 4.00 గంటలకు బంజారాహిల్స్ లో ఎమ్ఎల్సీ కల్వకుంట్ల కవిత తన నివాసం పక్కన ఉన్న భవనంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన పూజ ఏర్పాట్లు చేస్తున్నారు. పూజ అనంతరం ఎమ్మెల్సీ కవిత తెలంగాణ జాగృతి తరఫున కేసీఆర్ గారికి కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడంపై.. జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నా పై.. కొత్త కార్యాలయంలో మాట్లాడనున్నారు. కేసీఆర్ కు మద్దతుగా తెలంగాణ జాగృతి తరఫున కవిత పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు.

# 'బంగ్లా'లో యూనస్ ధ్వంస రచన



ఒక రంగంలో లబ్ధప్రతిష్ఠుడైనంత మాత్రాన సదరు వ్యక్తి అన్ని రంగాల్లోనూ విశేషంగా రాణించగలడని చెప్పలేం. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌ను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అల్లర్లకు, రాజకీయ అస్థిరత్వానికి మారుపేరుగా నిలిచిన బంగ్లాదేశ్‌లో పుట్టిపెరిగిన యూనస్ మైక్రో ఫైనాన్స్ బ్యాంక్ ద్వారా సూక్ష్మరుణాలను అందజేసి లక్షలాది ప్రజలను పేదరికంనుంచి బయటపడవేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. ఆయన కృషికి గాను సుమారు పాతికేళ్ల కిందట నోబెల్ శాంతి బహుమతి కూడా లభించింది. అయితేనేం, గత ఏడాది రిజర్వేషన్ల గలభా కారణంగా ప్రధాని షేక్ హసీనా పదవి పోగొట్టుకుని, భారత్‌కు పరారై వచ్చిన తర్వాత ప్రభుత్వ తాత్కాలిక సారథిగా పగ్గాలు చేపట్టిన యూనస్, గత తొమ్మిది నెలలుగా పాలనను పట్టాలెక్కించలేక పడరాని పాట్లు పడుతున్నారు. మైక్రోఫైనాన్స్ బ్యాంకర్‌గా, ప్రొఫెసర్‌గా పేరొందిన ఈ పెద్దాయనకు పాలనానుభవం నాస్తి. రాజకీయానుభవం శూన్యం. ఫలితంగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఇంటాబయటా వివాదాలకు కారణమవుతున్నాయి. అవామీలీగ్ అధినేత షేక్ హసీనాతో ఆయనకు గతంనుంచీ విభేదాలు ఉన్నాయి. నోబెల్ సంస్థ యూనస్‌కు శాంతి బహుమతి ఇచ్చినా, పేదలను రుణాల ఊబిలోకి నెట్టివేశారంటూ ఆయనను హసీనా బహిరంగంగానే విమర్శించేవారు. దీనికితోడు కార్మిక చట్టాలను ఉల్లంఘించారంటూ ఏణ్ణర్థం కిందట బంగ్లాదేశ్ కోర్టు యూనస్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. కాకతాళీయంగా ఆ సమయంలో అధికారంలో ఉన్నది షేక్ హసీనాయే కావడం ఇద్దరికీ మరింత దూరం పెరిగేందుకు దోహదపడింది. ఈ పరిణామాల నేపథ్యంలో యూనస్ ముందుగా హసీనాపైనా, ఆమె పార్టీపైనా గురిపెట్టారు. హసీనా ప్రధాన అనుచరులను అరెస్ట్ చేయించడంతో శాంతించకుండా ఏకంగా ఆమె పార్టీనే నిషేధించారు. పాకిస్తాన్‌లో బెంగాలీల స్వయం ప్రతిపత్తికోసం పోరాటం సల్పి, స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన, ఏడున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన అవామీలీగ్‌పై ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద వేటు వేయడం సహజంగానే లక్షలాది పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమైంది. పార్లమెంటు అనుమతి లేకుండా ఒక రాజకీయ పార్టీని ఎలా నిషేధిస్తారంటూ హసీనా ప్రశ్నించడంలో అర్థం లేకపోలేదు. మరోవైపు ఆమెకు ఆశ్రయం ఇచ్చిందన్న అక్కసుతో భారత్‌తో కోరి కయ్యానికి కాలు దువ్వుతున్నారు.స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావంలో భారత్ పోషించిన పాత్ర ఎటువంటిదో ఆ దేశంలో ఎవరిని అడిగినా చెబుతారు. కానీ యూనస్ ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలకు తామే దిక్కనే విధంగా చైనా గడ్డపైనుంచి ఆయన చేసిన ప్రకటన ఇరుదేశాల స్నేహ సంబంధాలను దెబ్బతీసింది. అంతటితో ఊరుకోకుండా ఇటీవల టగ్ బోట్ల నిర్మాణానికి భారత ప్రభుత్వ రంగ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని తెగతెంపులు చేసుకున్నారు. ఇందుకు ప్రతిగా బంగ్లాదేశ్ నుంచి పలు దిగుమతులపై భారత్ ఆంక్షలు విధించడంతో రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలహీనపడ్డాయి. తాను తాత్కాలిక సారథినేనన్న విషయానికి విస్మరించి, నియంత పోకడలు పోతున్న యూనస్ వైఖరిపై బంగ్లాదేశ్‌లో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. సకాలంలో ఎన్నికలు నిర్వహించి, ప్రజాప్రభుత్వానికి పాలనా పగ్గాలు అప్పగించవలసిన యూనస్, ఉద్దేశపూర్వకంగా ఎన్నికలను వాయిదా వేస్తున్నారని ఆ దేశ సైన్యాధ్యక్షుడు సైతం బహిరంగంగానే నిరసన వ్యక్తం చేయడం గమనార్హం. అయితే, అవసరమైతే వీధిపోరాటాలకైనా సిద్ధమే తప్ప, ముందుగా ఎన్నికల నిర్వహణ వీలు కాదని యూనస్ మొండికేస్తున్నారు.వచ్చే ఏడాది ఆగస్టులోగాని ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వానికి సహకరించని అధికార యంత్రాంగం, సద్దుమణగని అల్లర్లు, పట్టాలెక్కని పాలన యూనస్ తాత్కాలిక ప్రభుత్వాన్ని వధ్యశిలపై నిలబెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేస్తున్నట్లు ఇటీవల పుకార్లు గుప్పుమనడంలో ఆశ్చర్యమేముంది? ఇవన్నీ నిజం కాదంటూ ప్రభుత్వం కొట్టిపారేసినా, ఎన్నికలు జరిగేంతవరకూ యూనస్ ప్రభుత్వం ఉంటుందా, ఊడుతుందా అనే సందేహం అందరిలోనూ నెలకొంది. ప్రపంచమంతా మెచ్చిన వ్యక్తికి అధికారం చేపట్టాక ఏమైంది? ఈ ప్రశ్న ఇప్పుడు బంగ్లాదేశ్‌లోని ప్రతి పౌరుడినీ వేధిస్తోంది. ఈ విషయంలో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ ఆత్మావలోకనం చేసుకోవడం మంచిది.

# తెలుగు సాహిత్యానికి తత్వశిఖరం



తెలుగు సాహిత్యాన్ని తన అద్భుత కవిత్వంతో, లోతైన విమర్శలతో, విశ్లేషణాత్మక వ్యాసాలతో కొత్త దిశల్లో నడిపించిన మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ. ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాకుండా, సమాజంలో చైతన్యాన్నిరేపే ఒక విప్లవాత్మక శక్తి. ఆధునిక తెలుగు కవిత్వానికి ఊతమిచ్చిన మహోన్నత వ్యక్తిత్వం. శేషేంద్ర సాహిత్య ప్రపంచం వర్ణనాత్మకత, తత్వచింతన, సామాజిక చింతన, భాషా వైవిధ్యం, అంతర్జాతీయ దృక్పథాలతో విస్తరించిఉంది. శేషేంద్ర శర్మ జననం 1927 అక్టోబర్ 20న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగరాజుపాడు గ్రామంలో జరిగింది. ఆయన తండ్రి సంస్కృత సాహిత్యంలో ప్రావీణ్యం కలిగిన పూజారి గుంటూరు సుబ్రహ్మణ్య శర్మ. చిన్ననాటినుంచే శేషేంద్రకు వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృతం మీద మక్కువ పెరిగింది. విద్యాభ్యాసం తొటపల్లి గూడూరు పాఠశాలలో ప్రారంభమై ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడిగా, మద్రాసు లా కాలేజీనుండి న్యాయశాస్త్రంలో డిగ్రీతో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగం చేసినప్పటికీ, సాహిత్యపట్ల ఆయన ఆసక్తి ఎప్పటికీ తగ్గలేదు. శేషేంద్ర శర్మ సాహితీ ప్రస్థానం అసాధారణం. ఆయన కవిత్వంలో ఉన్న అద్భుత ఊహాశక్తి, సామాజిక చింతన, తత్వవిచారణ, వ్యక్తిత్వ విశ్లేషణ తెలుగు కవిత్వాన్ని కొత్త శిఖరాలకు చేర్చింది. కేవలం రూపకాలు, అలంకారాలతోనే కాదు, కవిత్వంలో లోతైన భావాలను మేళవించి సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా రచనలు చేశారు. తన కవిత్వంలో తర్కం, ఆచార విచారం, చరిత్ర బోధ, తత్వచింతన మేళవించి ఒక ప్రత్యేక శైలిని రూపొందించారు. నా దేశం నా ప్రజలు అనే కావ్యం శేషేంద్రగారిని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చింది. ఇందులో సామాజిక అసమానతలు, దేశభక్తి, మానవీయత వంటి అంశాలను రసప్రధంగా, ఆవేశపూరితంగా వ్యక్తీకరించారు. మంథర, షోడశి -రామాయణ రహస్యాలు, ఆధునిక మహాభారతం, స్వర్ణహంస, సముద్రపు రెక్కలు, నెమలికన్ను వంటి రచనలు శేషేంద్రను ఆధునిక తెలుగు సాహిత్యంలో దృఢంగా నిలిపాయి. మంథరలో భారతీయ తత్వశాస్త్రం పట్ల ఆయన అవగాహన, అంతరంగా పొందిన అనుభూతులు ప్రతిఫలిస్తాయి. షోడశిలో రామాయణంలోని రహస్యాలను లోతుగా పరిశీలిస్తూ శ్రీవరాలను సరికొత్త దృక్పథంలో ఆవిష్కరించారు. శేషేంద్ర వచన కవిత్వం కేవలం వర్ణనాత్మకతకు పరిమితం కాకుండా, జాతీయ, అంతర్జాతీయ సాహిత్య ధోరణులను అద్భుతంగా మిళితం చేసింది. అందులో భాషా వైవిధ్యం, సంస్కృత పదసముపేతం, ప్రతీకలు, చిహ్నాల విశేష ప్రయోగం, శబ్దసౌందర్యం సమ్మేళనం సాహితీ పాఠకులను విశేషంగా ఆకర్షిస్తుంది. కవిత్వం అంటే కేవలం భావాలను వ్యక్తీకరించడం మాత్రమే కాదు, అది ఒక చైతన్య ప్రవాహం అని ఆయన నిరూపించారు. శేషేంద్ర కవిత్వం మనసుకు హత్తుకునే రూపంలో, ఒకవేళ వినిపిస్తే సంగీతంలా, చదివితే తత్వ రససుధగా అనిపిస్తుంది. సముద్రం నా పేరు, గొరిల్లా, మండే సూర్యుడు, కవిసేన మేనిఫెస్టో, రక్తరేఖ, కాలరేఖ, జనవంశమ్ వంటి రచనలు కాలంతో పోరాడే కవిత్వానికి, సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యానికి ప్రతీకలు. శేషేంద్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1994లో నాదేశం నా ప్రజలుకు), తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, కలకత్తా రాష్ట్రీయ హిందీ అకాడమీ అవార్డు, విశ్వకవి పురస్కారం లాంటి అనేక ప్రతిష్ఠాత్మక బహుమతులు లభించాయి. ఆయన రచనలు తెలుగులోనే కాదు, అనేక భాషల్లోకి అనువదించబడి విశ్వసాహిత్యంలోనూ తనదైన స్థానం సంపాదించుకున్నాయి. 2007 మే 30న ఆయన భౌతికంగా మన మధ్య నుండి వెళ్లిపోయినా, ఆయన సాహిత్యమూర్తి తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది. తెలుగు సాహిత్య చరిత్రలో శేషేంద్ర శర్మ ఒక మహానామం. ఆయన కవిత్వం, విమర్శ, తత్వచింతనలు ఈ తరానికి మాత్రమేకాదు, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవనున్నాయి.

# అన్నదాతలకు మళ్లీ అన్యాయం



నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు మళ్లీ అన్యాయం చేసింది. ఉత్పత్తి వ్యయంతో సంబంధం లేకుండా బుధవారం 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలను, రైతు సంఘాల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసి, కంటితుడుపు తతంగంగా ధరల నిర్ణయం చేసింది. రైతులను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తుందని స్వోత్కర్ష చేసుకునే బిజెపి దగాకోరుతనానికి కనీస మద్దతులో కొరవడ్డ చిత్తశుద్ధే ఒక ఉదాహరణ. ఏటేటా పెరుగుతున్న పెట్టుబడికి, మద్దతు ధరకీ లంగరు అందక తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్న రైతాంగం దాదాపు నాలుగు దశాబ్దాలుగా రక్షణ కోసం గావుకేక వేస్తోంది. 1995 - 2022 మధ్య దేశంలో 3 లక్షల 96 వేల 438 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. వ్యవసాయం బతుకు భరోసా ఇవ్వక ప్రతిరోజూ దేశంలో 33 మంది అన్నదాతలు ప్రాణాలు తీసుకుంటున్నట్టు లెక్కలు వక్కాణిస్తున్నాయి. రైతు కన్నీరు కార్చిన చోట అభివృద్ధికి, ఆధునికతకీ అర్థమే లేదని సామాజికవేత్తలు తరచూ ఉటంకిస్తారు. మరి ఏటా ఇంతమంది రైతుల ఉసురు తీసుకుంటున్నా- పాలకులు ఏం అభివృద్ధి సాధిస్తున్నట్టు? ఎవరి సంపద సృష్టికి అహర్నిశలూ పాటు పడుతున్నట్టు? వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడ్డానికి 2006లో స్వామినాథన్ కమిషన్ కొన్ని విలువైన సూచనలు చేసింది. పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి (సి2 ం 50 శాతం) గిట్టుబాటు ధర కల్పించాలని సిఫార్సు చేసింది. పాలకులు దానిని పట్టించుకున్నదే లేదు. పదకొండేళ్ళుగా మోడీ ప్రభుత్వం కిసాన్ ఉద్ధరిణిగా గొప్పలు చెప్పుకుంటూ, ఆచరణలో తీవ్ర ద్రోహానికి పాల్పడుతోంది. ఈ ఏడాది వరి మద్దతు ధర కేవలం రూ.69 పెంచింది. సాగు వ్యయం చాంతాడులా పెరిగితే - అది అందించిన సాయం ఉంగరపు తాడంత కూడా లేదు. మొక్కజొన్న, కంది, మినుము, వేరుశనగ వంటి పంటలకు నిజమైన వృద్ధి రేటు ఒక శాతం కన్నా తక్కువగానే ఉంది. ఒక క్వింటా వరి ఉత్పత్తికి జాతీయ సగటు వ్యయం రూ.3135 కాగా, మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఘనంగా ప్రకటించిన మద్దతు ధర రూ.2369. పత్తికి రూ.16 వేల మేర కనీస మద్దతు ధర ఉండాలని తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ప్రతిపాదించింది. కేంద్రం తన మద్దతును రూ.7710కే పరిమితం చేసింది. రాగులు, జొన్న, నువ్వులు, కంది వంటి పంటల విషయంలోనూ ఇదే దుస్థితి! మోడీ ప్రభుత్వ మద్దతు ధరల ప్రహసనం కేవలం కంటితుడుపునకే తప్ప - రైతుల కష్టనష్టాలను, కన్నీరునూ అరికట్టటానికి కాదని అర్థమవుతోంది. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణ పథకాన్ని కొనసాగించటం గురించి గొప్పగా చెబుతూనే- దీనివల్ల ఖజానాపై రూ.15 వేల 640 కోట్ల భారం పడుతుందని కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ వాపోయారు. కొన్ని లక్షల కోట్ల వ్యయప్రయాసలను నిత్యం మోస్తున్న రైతులకు అందించే రుణ సహాయాన్ని 'భారం'గా భావించటంలోనే ఈ పాలకుల మొసలి కన్నీరు బయటపడుతుంది. కేంద్ర ప్రభుత్వం అరకొరగా అందిస్తున్న రూ.6 వేల పిఎం కిసాన్‌లో నమోదైన రైతుల సంఖ్య 9 కోట్ల 70 లక్షలు మాత్రమే! కార్పొరేట్లకు ఏటా లక్షల కోట్ల లబ్ధి చేకూర్చే మోడీ ప్రభుత్వం ఈపాటి సహాయానికే గొప్పలు చెప్పుకోవడం, పెనుభారం అన్నట్టు పెడ బొబ్బలు పెట్టడం విచిత్రంగా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగం కీలకమైన భూమిక వహిస్తోంది. కోట్లాది మంది రైతుల, వ్యవసాయ కార్మికుల, కౌలుదారుల అమూల్యమైన శ్రమ తగిన ప్రతిఫలం పొందకుండానే దేశంలోని అన్ని తరగతుల ప్రజలకు ఆహారంగా సమకూరుతోంది. వ్యవసాయం కార్పొరేటీకరణ చెందితే- మధ్య తరగతి ప్రజలు సైతం ఆహార ధాన్యాలను కొనుక్కోవటానికి పెద్దఎత్తున ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. భారతదేశపు లక్షలాది గ్రామాల్లో ఉన్న రైతులను, వ్యవసాయ కార్మికులను, వారంతా ఆధారపడే వ్యవసాయరంగాన్ని కాపాడుకోవడం దేశంలోని ప్రజలందరి కర్తవ్యం. అందుకోసం ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన సిఫార్సులు అమలు చేయాలని రైతులూ, రైతు సంఘాలూ చాలా ఏళ్లుగా సాగిస్తున్న పోరాటంలో గొంతు కలపాలి. రైతుకు మద్దతు ఇవ్వడం అంటే దేశపు వెన్నెముకకు అండగా నిలబడడమే!

